


చంద్రబాబుకు నీరాజనం



బహిరంగ సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న చంద్రబాబు నాయుడు

భారీగా తరలివచ్చిన జనం

- జై బాబు..జైజై బాబు అంటూ పెద్దపెట్టున నినాదాలు
- టీడీపీ, జనసేన శ్రేణులతో కిక్కిరిసిన సభా ప్రాంగణం
- ఖాళీ లేకపోవడంతో రోడ్లపైనే ఉండిపోవాల్సిన పరిస్థితి
- వెంకన్నపాలెం నుంచి కె.కోటపాడు వరకు పసుపుమయం
- ఊహించినదానికన్నా ఎక్కువ మంది హాజరు కావడంతో తెలుగు తమ్ముళ్లు ఉబ్బితబ్బిబ్బు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్-అనకాపల్లి/చోడవరం/కె.కోటపాడు/మాడుగుల)

'రా...కదలిరా' నినాదంతో తెలుగుదేశం పార్టీ సోమవారం అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం గొండుపాలెం సమీపంలో నిర్వహించిన బహిరంగ సభ విజయవంతం అయ్యింది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి వందలాది వాహనాల్లో టీడీపీ, జనసేన కార్యకర్తలు, మద్దతుదారులు, సానుభూతిపరులు పెద్ద సంఖ్యలో సభకు హాజరయ్యారు. ఇటు వెంకన్నపాలెం నుంచి అటు కె.కోటపాడు వరకు మొత్తం పసుపుమయం అయ్యింది. చంద్రబాబు ప్రసంగం ప్రారంభించడానికి ముందే సభా ప్రాంగణం మొత్తం నిండి పోయింది. దీంతో చాలా మంది కార్యకర్తలు రోడ్డుపైనే ఉండిపోయారు. 'రా.. కదలిరా' సభకు ఊహించిన దానికంటే ఎక్కువ మంది హాజరు కావడంతో తెలుగు తమ్ముళ్లు ఉబ్బితబ్బిబ్బయ్యారు. వచ్చే ఎన్నికల్లో మాడుగులలో తెలుగుదేశం గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

'రా.. కదలిరా' సభ ఉదయం 11 గంటలకు ప్రారంభం అవుతుందని నిర్వాహకులు ప్రకటించగా, తొమ్మిది గంటల నుంచే పలు నియోజకవర్గాల నుంచి టీడీపీ కార్యకర్తలు, మద్దతుదారులు, సానుభూతిపరులతోపాటు జనసేన శ్రేణులు రావడం మొదలుపెట్టారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఉదయం 11:45 గంటలకు ప్రత్యేక హెలీకాప్టర్‌లో సభాస్థలికి చేరుకున్నారు. టీడీపీ, జనసేన నాయకులు, ప్రజలు కేరింతలు కొడుతూ జై బాబు, జైజై బాబు అంటూ నినాదాలు చేశారు. హెలీప్యాడ్ వద్ద మాజీ మంత్రులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, మాడుగుల ఇన్‌చార్జి పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, సీనియర్ నాయకుడు పైలా ప్రసాదరావు, తదితరులు ... మిగతా 4వ పేజీలో


సభకు హాజరైన అశేష జనం

విశాఖను వైసీపీ నేతలు దోచుకున్నారు

నాడు పెట్టుబడులకు స్వర్గధామం..
నేడు కబ్జాదారులకు కేంద్రం

- టీడీపీ తెచ్చిన కంపెనీలను వెళ్లగొట్టారు
- ఉత్తరాంధ్రలో అభివృద్ధి లేదు.. యువతకు ఉద్యోగాలు లేవు
- జగన్‌కు మరోసారి అవకాశం ఇస్తే రాష్ట్రం సర్వనాశనం
- అరాచక పాలనను అంతమొందించాలని ప్రజలకు పిలుపు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్-అనకాపల్లి/చోడవరం/కె.కోటపాడు/మాడుగుల)

ఉత్తరాంధ్ర అభివృద్ధికి టీడీపీ హయాంలో ఎన్నో కంపెనీలను తీసుకొస్తే, జగన్ వచ్చిన తరువాత తరిమేశా రని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆరోపించారు. సోమవారం మధ్యాహ్నం 'రా...కదలిరా' పేరుతో అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం గొండుపాలెంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రశాంతతకు నిలయమైన విశాఖపట్నం..వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అశాంతి, హింసకు నిలయంగా మరిందని చంద్రబాబు ఆందోళన వ్యక్తంచేశారు. రుషికొండను అనకొండలా మింగేసి రాజ ప్రాసాదం కట్టుకున్నారని జగన్‌ను ఉద్దేశించి అన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాలకు కేంద్రం ఇస్తున్న రూ.1.5 లక్షలు తప్ప రాష్ట్రం ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదన్నారు. ఉత్తరాంధ్రలో రోడ్లు వేయలేదు, అభివృద్ధి లేదు, పిల్లలకు ఉద్యోగాలు రాలేదన్నారు. విశాఖ జిల్లా పెట్టుబడులకు స్వర్గధామమని, కానీ వైసీపీ పాలనలో కబ్జాదారులకు కేంద్రంగా మారిందన్నారు. ఒక్క విశాఖపట్నంలోనే వైసీపీ నాయకులు రూ.40 వేల కోట్ల విలువ చేసే భూములను దోచేశారన్నారు. టీడీపీ హయాంలో లులూ, హెచ్ఎస్‌బీసీ, అదాని డేటా సెంటర్ వంటి వాటిని తీసుకొస్తే...జగన్ అధికా రంలోకి వచ్చిన తరువాత వారందరినీ తరిమేసి, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటు కాలేదని, రైల్వే శాఖ అడిగిన భూమిని ఈ ప్రభుత్వం ఇవ్వలేకపోయిందని ఎద్దేవా చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై జగన్ నోరు మెదపడం లేదన్నారు.

వైసీపీ అరాచక, అవినీతి పాలన సాగిస్తున్నదని చంద్రబాబు అన్నప్పుడు సభికుల నుంచి పెద్దఎత్తున స్పందన వచ్చింది. వైసీపీ పాలనలో మద్యం ధరలు, కరెంటు చార్జీలు, ఇళ్ల పన్నులు పెంపు, చెత్త పన్ను విధింపు, పెట్రోల్, డీజిల్ రేట్లు ఎంతెంత పెరిగాయో చంద్రబాబు సవివరంగా వెల్లడిస్తుంటే సభకు హాజరైన ప్రజలు శ్రద్ధగా ఆలకించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలు, రైతుల కోసం అమలు చేయనున్న 'సూపర్ సిక్స్' పథకాల గురించి వివరించారు. ప్రసంగం ముగించిన తరువాత 'సైకో పోవాలి...సైకిల్ రావాలి' అంటూ డీజేలో పాటనే ప్లే చేయగా, స్టేజీ ముందున్న యువత నృత్యాలు చేశారు. చంద్రబాబు నాయుడు రెండు చేతులు పైకెత్తి వారిని ... మిగతా 4వ పేజీలో


టీడీపీ నేతలు బహూకరించిన కరవాలాన్ని చూపుతున్న చంద్రబాబు

నిలిచిన రిజిస్ట్రేషన్లు



- ఈ-సంతకం వద్ద ఆగిపోయిన డాక్యుమెంట్లు
- జగనన్న ఇళ్ల కాలనీల్లో స్థలాలకు సంబంధించి సచివాలయాల్లో మాత్రం యథాప్రకారం రిజిస్ట్రేషన్లు
- అందుకోసమే రెగ్యులర్ సర్వర్ డౌన్ చేశారనే అనుమానాలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు సోమవారం ఆగిపోయాయి. రాష్ట్రం అంతటా ఇదే పరిస్థితి. సర్వర్ నెమ్మది (స్లో) కావడంతో డాక్యుమెంట్ల అప్‌లోడింగ్‌కు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఏదోలా ఒక దాని తరువాత ఒకటి చేసినా సబ్ రిజిస్ట్రార్ల ఈ-సంతకం వద్దకు వచ్చేసరికి సర్వర్ పూర్తిగా మొండికేసింది. దాంతో రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. ఉదయం 11 గంటలలోపు ఆనందపురం, మధురవాడ, సూపర్‌బజారు, అక్కయ్యపాలెం తదితర కార్యాలయాల్లో ఒక్కొక్క రిజిస్ట్రేషన్ మాత్రమే జరిగింది. ఆ తరువాత పూర్తిగా స్తంభించి పోయింది. ఒక్క ఆనందపురంలోనే 25 డాక్యుమెంట్లు ఈ-సంతకం వద్ద ఆగిపోయాయి.

ఈ నెల 15లోగా పూర్తిచేయాలని సర్వర్ అప్పగింత

రిజిస్ట్రేషన్ల శాఖలో సర్వర్ డౌన్ కావడం సాధారణ అంశమే. అయితే ఏదో ఒక సమయంలో తిరిగి సర్దుకొని రిజిస్ట్రేషన్లకు అవకాశం ఉండేది. ఇప్పుడు తలెత్తిన సమస్య ప్రత్యేకమైనది. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు జగనన్న కాలనీలు అంటూ సెంటు భూమి ఇచ్చింది. వాటిలో కొన్ని చోట్ల ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. లబ్ధిదారులకు ఇచ్చిన సెంటు భూమిని వారి పేరుతో రిజిస్ట్రేషన్ చేయాలని సీఎం జగన్ నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 26 లక్షల మందికి ఇలా రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది. ఈ బాధ్యత సాధారణ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అప్పగిస్తే అక్కడ రెగ్యులర్ రిజిస్ట్రేషన్లకు ఆటంకం కలుగుతుందనే ఉద్దేశంతో సెంటు భూముల రిజిస్ట్రేషన్ల కోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో ... మిగతా 4వ పేజీలో

భారత్ హ్యాట్రిక్


విజయం అనంతరం బుమ్రాను అభినందిస్తున్న సహచర ఆటగాళ్లు

విశాఖలో మరో విజయం

వరుసగా మూడో టెస్ట్‌లోనూ గెలుపు

- కలిసొచ్చిన పిచ్‌పై కదంతొక్కిన ఇండియా
- ఇంగ్లండ్‌పై 106 పరుగులతో విక్టరీ
- రాణించిన బుమ్రా, అశ్విన్... చెరో 3 వికెట్లు
- ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ జస్‌ప్రీత్ బుమ్రా
- ఉత్తమ బ్యాట్స్‌మెన్‌గా జైస్వాల్, గిల్

విశాఖపట్నం (స్పోర్ట్స్), ఫిబ్రవరి 5:

అద్వితీయమైన ఆటతీరుతో భారత్ జట్టు తనకు కలిసొచ్చే పిచ్‌పై మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టెస్ట్‌లో 106 పరుగులతో విజయం సాధించింది. దీంతో ఇప్పటివరకూ ఇక్కడ జరిగిన మూడు (ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్‌తో) టెస్ట్ మ్యాచ్‌లలో విజయం సాధించినట్టయ్యింది.

కుప్పకూలిన ఇంగ్లండ్ బ్యాటింగ్

పిచ్‌పై పగుళ్లు ఏర్పడి నాలుగో రోజు స్పిన్నర్లకు అనుకూలించేలా మారినా కెప్టెన్ రోహిత్‌శర్మ ఫాస్ట్ బౌలర్లు బుమ్రా, అక్షర్ పటేల్‌లతోనే బౌలింగ్ ప్రారంభించాడు. ఓవర్‌నైట్ స్కోరు 67/1తో ఆట ప్రారంభించిన ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్ జాక్ క్రాలీ, రెహన్ అహ్మద్ జట్టు స్కోరును వందకు చేర్చారు. ఆ సమయంలో రెహన్ అహ్మద్‌ను (23)ను అక్షరపటేల్ అద్భుతమైన బంతితో ఎల్బీడబ్ల్యు చేశాడు. రెహన్ స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన పోప్...కొద్దిసేపు బ్యాట్ ఝుళిపించాడు. బుమ్రా స్థానంలో బౌలింగ్‌కు వచ్చిన అశ్విన్...పోప్‌ను అవుట్ చేశాడు. పోప్ స్థానంలో వచ్చిన రూట్ కూడా అశ్విన్ బౌలింగ్‌లోనే అక్షరపటేల్ క్యాచ్ పట్టడంతో వెను తిరిగాడు. వ్యక్తిగత 61 పరుగుల వద్ద స్టంపౌట్ నుంచి తప్పించుకున్న జాక్ క్రాలీ (73)ని కులదీప్ యాదవ్ ఎల్బీడబ్ల్యుగా అవుట్ చేశాడు. కొద్దిసేపటికే జానీ బెరస్టోవ్‌ను (26) బుమ్రా ఎల్బీడబ్ల్యుగా పెవిలియన్‌కు పంపడంతో లంచ్ సమయానికి ఇంగ్లండ్ 194 పరుగులకు ఆరు వికెట్లు కోల్పోయింది. లంచ్ తర్వాత కెప్టెన్ బెన్ స్టోక్ (11) అనూహ్యంగా రనౌట్ అయ్యాడు. ఆ తరువాత బెన్ ఫోక్స్ (36), టామ్ ... మిగతా 4వ పేజీలో


కేంపా గ్రేట్ ఇండియన్ స్ట్రైక్ ఆఫ్ ది మ్యాచ్ అందుకుంటున్న యశస్వి జైస్వాల్


శుభ్‌మన్ గిల్‌కు ఎస్‌బీఐ లైఫ్ అప్నే లియే అప్నే కేలియే అవార్డు

హడలిపోతున్న అధికారులు

- భూ వ్యవహారాల్లో అధికార పార్టీ నేతల నుంచి బెదిరింపులు
- రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖలకు అత్యధికం
- నేను వచ్చానంటే పని చేసిపెట్టాల్సిందేనని రంకెలు వేసిన ఒక నేత

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

"విశాఖపట్నంలో భూముల విలువ పెరిగింది. రియల్ ఎస్టేట్ వ్యవహారాల్లో అడ్డగోలు వ్యవహారాలు జరుగుతున్నాయి. వీటికి సహకరించాల్సిందిగా అధికారులపై ఒత్తిళ్లు ఉన్నాయి. కొందరైతే బెదిరిస్తున్నారు. మా వద్ద కొన్ని ఫిర్యాదులు ఉన్నాయి. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ దృష్టికి కూడా కొందరు అధికారులు ఈ సమస్య తీసుకువెళ్లారు"

- విలేకరుల సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్.

అధికార పార్టీ నేతల నుంచి వస్తున్న ఒత్తిళ్లను జిల్లాలో ప్రభుత్వ అధికారులు తట్టుకోలేకపోతున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సరైన సహకారం, భరోసా లభించడం లేదు. వారిదీ అదే పరిస్థితి. అయినప్పటికీ బయటపడడం లేదు. తహసీల్దార్ రమణయ్య హత్యతో ఇలాంటి విషయాలను అధికారులు మిత్రుల వద్ద చెప్పుకొని వాపోతున్నారు. ఓ మంత్రి భయపెట్టారని ఒకరు, అధికార పార్టీకి చెందిన నేత ఒకరు తనను చంపేస్తానన్నారని మరొకరు, ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయి నియోజకవర్గ ఇన్‌చార్జిగా చక్రం తిప్పుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి తమను బెదిరించారని పలువురు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ తరహా బెదిరింపులు ఎక్కువగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖలకు ఉంటున్నాయి.

విశాఖపట్నం అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాలు, వాటితో ముడిపడి ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఈ వేధింపులు కొత్తమీ కాదు. గతం(2021 సెప్టెంబరు)లో ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు కొమ్మాదిలో 12 ఎకరాల భూమి కొనుగోలు విషయంలో నాటి విశాఖ రూరల్ తహసీల్దార్‌ని, మధురవాడ సబ్ రిజిస్ట్రార్‌ని ఇబ్బందిపెట్టారు. ఎకరా రూ.8 కోట్లు చొప్పున ... మిగతా 4వ పేజీలో

ఆరోగ్యం బాగాలేదు... అప్రాధాన్య పోస్టు ఇవ్వండి

- రూరల్ తహసీల్దారుగా బాధ్యతలు తీసుకోని శ్రీనివాస మిశ్రా

విశాఖపట్నం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా కొత్తవలస నుంచి బదిలీపై జిల్లాకు వచ్చిన శ్రీనివాస మిశ్రా విశాఖ రూరల్ తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించలేదు. తనకు ఆరోగ్యపరంగా సమస్యలు ఉన్నందున అప్రాధాన్య మండలానికి పంపాలని, లేకపోతే కలెక్టరేట్‌లో సెక్షన్ బాధ్యతలు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. అయితే సీసీఎల్ఏ ఆదేశాలు, కలెక్టర్ ఉత్తర్వుల మేరకు రూరల్ తహసీల్దారుగా సోమవారంలోగా బాధ్యతలు తీసుకోవాలని ఉన్నతాధికారులు సూచించారు. అయినప్పటికీ ఆయన ముందుకు రాలేదు. రూరల్ తహసీల్దారుగా పనిచేసి గత నెల 31న విజయనగరం జిల్లా బొండపల్లి మండలానికి బదిలీ ... మిగతా 4వ పేజీలో

అంతా గోప్యం

- తహసీల్దార్ రమణయ్య హత్యకు గల కారణాలను వెల్లడించని పోలీసులు
- నగర శివారులో రహస్య ప్రాంతంలో నిందితుడి విచారణ


తహసీల్దార్ రమణయ్యపై దాడి చేసిన వ్యక్తి

విశాఖపట్నం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ సనపల రమణయ్య హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్టు ప్రకటించిన పోలీసులు అందుకు గల కారణాలను వెల్లడించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అపార్టుమెంట్ నిర్మాణం జరిగిన భూమికి సంబంధించిన కన్వేయన్స్ డీడ్ జారీ వ్యవహారమే హత్యకు కారణమని చెప్పారు. నిందితుడైన మురహరి సుబ్రమణ్యం గంగారాం ఒక నిర్మాణ రంగ సంస్థలో మేనేజర్‌గా పనిచేస్తున్నట్టు తెలిపారు. అయితే ఆ సంస్థ ... మిగతా 4వ పేజీలో

తహసీల్దార్ హత్య కేసులో నిందితుడు అరెస్టు

- కన్వేయన్స్‌డీడ్ జారీ చేయలేదనే... - వివరాలు మెయిన్‌లో

స్విమ్మింగ్‌లో నాగ గ్రీష్మిణికి పతకాలు



పతకాలతో గ్రీష్మిణి

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 5: అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన వి.నాగ గ్రీష్మిణి స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించి రికార్డు నెలకొల్పింది. చెన్నైలో జరిగిన ఈ టోర్నీలో 50మీ. బ్రెస్ట్ స్ట్రోక్‌లో స్వర్ణ పతకం సాధించిన గ్రీష్మిణి..100మీ. బ్రెస్ట్ స్ట్రోక్‌లో రజతం, 200మీ. బ్రెస్ట్ స్ట్రోక్ కాంస్యం సాధించింది. ఈ సందర్భంగా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి మోహన్ వెంకటరామ్, ఇతర ప్రతినిధులు, సీనియర్ స్విమ్మర్లు, కోచ్‌లు నాగ గ్రీష్మిణిని అభినందించారు.

తహసీల్దార్ హత్య కేసు దోషులపై కఠిన చర్యలు: కలెక్టర్



సంతాపం వ్యక్తంచేస్తున్న కలెక్టర్, అధికారులు

మహరాణిపేట, ఫిబ్రవరి 5: విశాఖ రూరల్ మండల తహసీల్దారుగా విధు లు నిర్వహించి, బదిలీపై రిలీవ్ అయిన సనపల రమణయ్య మృతి పట్ల కలెక్టర్ ఎ.మల్లికార్జున తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, తహసీల్దార్ రమణయ్య హత్యకు గురవడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణి స్తోందని, త్వరలోనే దోషులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రమణయ్య ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ జిల్లా అధికారులు, సిబ్బంది రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూరి అశోక్, డీఆర్‌వో కె. మోహన్ కుమార్‌తోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోరాపుట్‌లో డీఆర్ఎం తనిఖీలు



యాక్సిడెంట్ రిలీఫ్ రైలు తనిఖీచేస్తున్న డీఆర్ఎం

విశాఖపట్నం, ఫిబ్రవరి 5: భద్రతా ఆడిట్‌లో భాగంగా డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్ సోమవారం కోరాపుట్ రైల్వే స్టేషన్‌లో పర్యటించారు. ముందుగా యాక్సిడెంట్ రిలీఫ్ రైలు, మెడికల్ ఎమర్జన్సీ రిలీఫ్ రైలు, ఇంజనీరింగ్ రిలీఫ్ రైళ్ల నిర్వహణపై తనిఖీలు చేపట్టారు. అనంతరం స్టేషన్‌లో పర్యటించి ప్రయాణికుల మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి అంశాలపై అధికారులతో సమీక్షించారు. వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సత్వరమే ధ్రువ పత్రాలు మంజూరు

సీతమ్మధార, ఫిబ్రవరి 5:సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ శ్రీరామమూర్తి అర్జీలు స్వీకరించారు.అక్కడిక్కడే పరిశీలించి అవసరమైన వారికి తక్షణమే సర్టిఫికెట్లు జారీ చేసేలా చర్యలు తీసుకున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, జనవరి 5: తాటిచెట్లపాలెం ఫీడర్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2-30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ సింహాచలం నాయుడు తెలిపారు. రైల్వేన్యూకాలనీ బజారు ఏరియా, మసీదు, రామాలయం ఏరియా, తాటిచెట్లపాలెం ప్రధాన రహదారి తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీతమ్మధార: నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు జోన్ 1 ఈఈ సింహాచలం నాయుడు తెలిపారు. కేఆర్ఎం కాలనీ, బాలయేసు చర్చి ప్రాంతం, ఆక్సిజన్ టవర్స్ వెనుక ప్రాంతం, నక్కవానిపాలెం, నక్కవానిపాలెం 60 ఫీట్ రోడ్డు ప్రాంతాల వినియోగదారులు గమనించాలని కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

సీతంపేట, ఫిబ్రవరి 5: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ద్వారకా స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాలివి.. సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్స్ లేఅవుట్‌లో ప్రశాంతి నిలయం అపార్టుమెంట్ సెల్లారులో అలూర్తి రా మరాజు (55) ఆఫీస్ తీసుకొని ఉంటున్నారు. ఆయన బిల్డర్‌గా కన్‌స్ట్రక్షన్ ఫీల్డులో పనిచేస్తున్నారు. అయితే, వ్యాపార పరంగా ఆర్థికపరమైన ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో మనస్తాపంతో అపార్టుమెంట్ తన కార్యాలయ గదిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ సభ్యుల సమాచారంమేరకు ఎస్ఐ ధర్మేంద్ర కేసు నమోదు చేశారు.

రహదారిపై వ్యాపారాలు.. రాకపోకలకు అవస్థలు

▸▸ గ్రేటర్ 27వ వార్డులో దుస్థితి



శ్రీనగర్ ప్రాంత రహదారి పక్కన ఆక్రమణలు

దొండపర్తి, ఫిబ్రవరి 5 : గ్రేటర్ 27వ వార్డులోని పలు ప్రాంతాల్లో రోడ్లపైనే తోపుడు బండ్లు, బడ్డీలు ఏర్పాటుచేసి వివిధ రకాల వ్యాపారాలు సాగించడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొంతమంది నెలవారీ మామూలు వసూలు చేసి బడ్డీలను ఏర్పాటుకు సహకరిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. శ్రీనగర్, బుధిల్‌పార్కు హోటల్, శ్రీ కృష్ణ విద్యా మందిర్, పౌరగ్రంథాలయం కూడలి ప్రాంతాల్లో రహదారులు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి బడ్డీలను ఏర్పాటు చేస్తున్నారు. వీటి ద్వారా భోజనాలు, టిఫిన్లు రోడ్లపైనే విక్రయిస్తున్నారు. కొనుగోలుదారుల వాహనదారులు రోడ్లపైనే పార్కింగ్ చేయడంతో రద్దీ నెలకొంటోంది. వాహనదారులు, పాదచారులు ప్రయాణించాలంటేకష్టమవుతోందని వాపోతున్నారు. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలు, కాలువల్లో వ్యర్థాలువేయడం వల్ల అవి నిండిపోవడంతో రహదారిపై మురుగునీరు ప్రవహిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన బడ్డీలను తొలగించాలని కోరుతూ వార్డు టీడీపీ అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి సోమవారం జీవీఎంసీలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఇకనైనా జీవీఎంసీ అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు అందిస్తున్న ఎన్.వి.బి.పి.రావు దంపతులు

మురళీనగర్, ఫిబ్రవరి 5: మురళీనగర్ 49వ వార్డు పరిధిలోని వానప్రస్థ వృద్ధాశ్రమంలో సోమవారం దాతలు దుప్పట్లను వితరణగా అందించారు. నగరంలోని శ్రీ చంద్రమౌళీశ్వర చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు తమ సేవల్లో భాగంగా వీటిని అందించారు. ట్రస్ట్ ప్రతినిధులు ఎన్.వి.బి.పి. రావు దంపతులు, ఆడిటర్ మధు ట్రస్ట్ నిర్వాహకులు శ్రీనివాస్ నేతృత్వంలో ఈ వితరణ కార్యక్రమం చేపట్టారు. కుటుంబాలకు దూరంగా జీవిస్తున్న వారికి చేయూతనందించాలనే ఉద్దేశంతో ఈ పంపిణీ చేపట్టినట్లు దాతలు పేర్కొన్నారు.

భాషల్లో సాంకేతిక పదజాలంపై జాతీయ సదస్సు



సెయింట్ జోసెఫ్ కళాశాలలో సదస్సులు ప్రారంభిస్తున్న అతిథులు

జ్ఞానాపురం, ఫిబ్రవరి 5: స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో కేంద్ర ప్రభుత్వ విద్యామంత్రిత్వ శాఖ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టెర్మినాలజీ కమిషన్ న్యూఢిల్లీ సౌజన్యంతో భారతీయ భాషల్లో విద్య, సాంకేతిక పదజాలం ప్రాధాన్యంపై రెండు జాతీయ సదస్సులను సోమవారం ప్రిన్సిపాల్ డా.సిస్టర్‌షైజీ ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా ఏయూ సివిల్ ఇంజనీరింగ్ విభాధిపతి ఆచార్య సీఎస్‌వీ సత్యనారాయణ రెడ్డి సదస్సు ప్రాముఖ్యతను వివరించారు.హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్య ఎస్ అరుల్ మౌళీ సాంకేతిక పదజాల అనువాద రీతులు, ద్రవిడియన్ యూనివర్సిటీ ఆచార్య ఎం.నికేశవమూర్తి భారతీయభాషల ఏకత్వంపై వివరించారు. రాజమండ్రి ప్రభుత్వ కళాశాల రాజనీతి విభాగ ఆచార్య కె.సీతామహాలక్ష్మి, నన్నయ్య యూనివర్సిటీ ఆచార్య టి.సత్యనారాయణ నూతన విద్యావిధానం,అంతరించిపోతున్న తెలుగు పదజాలం అంశంపై ప్రసంగించారు. కార్యక్రమంలో డాక్టర్ పికే జయలక్ష్మి, సిస్టర్ మేరీ, డాక్టర్ నిర్మల, జైన్‌థామస్ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి ఐద్వా కార్యవర్గ సమావేశాలు

కోశాధికారి పుణ్యవతి

విశాఖపట్నం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఐద్వా జాతీయ కార్యవర్గ సమావేశాలను ఈనెల 22 నుంచి 25 వరకూ విశాఖలో నిర్వహించనున్నట్టు అఖిలభారత కోశాధికారి ఎస్.పుణ్యవతి తెలిపారు. సీఐటీయూ కార్యాలయం లో సోమవారం ఆమె మాట్లాడారు. మహిళా సంఘాల సమస్యలపై నిరంతర పోరాటాలు జరిగే విశాఖలో ఈ సమావేశాలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. మహిళల హక్కుల పరిరక్షణ, స్వేచ్ఛ కోసం చేయాల్సిన పోరాటం, కర్తవ్యాలపై ఈసమావేశాల్లో కార్యాచరణ రూపొందిస్తామన్నారు. న్నివర్గాల ప్రజలు, విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు, మేధావులు, మహిళా అభ్యుదయవాదులు హాజరై విజయవంతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. సమావేశాలు ప్రారంభం రోజైన 22న భారీ ప్రదర్శన, బహిరంగసభ జరుగుతుందన్నారు. ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ జీఎంను దూషించిన మేనేజర్ సస్పెన్షన్

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 5: స్టీల్‌ప్లాంట్ ఎల్అండ్‌డీసీ విభాగాధిపతి ఎన్.భానును ఫోన్‌లో దుర్భాషలాడడంతో పాటు కులం పేరుతో దూషించిన అదే విభాగానికి చెందిన మేనేజర్ అనంత్ పర్వార్‌ను ఉక్కు యాజమాన్యం సోమవారం సస్పెండ్ చేసింది. తనను కులం పేరుతో మేనేజర్ పర్వార్ దూషించాడంటూ స్టీల్‌ప్లాంట్ పోలీసులకు జీఎం భాను ఈ నెల 2న ఫిర్యాదు చేయడంతో వారు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేశారు. ఈ ఫిర్యాదుపైస్పందించిన నగర కమిషనర్‌సౌత్ ఏసీపీ టి.త్రినాథ్‌ను విచారణా..దికారిగా నియమించారు. కాగా పర్వార్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఉక్కు యాజమాన్యానికి జీఎం ఫిర్యాదు చేయడం, దీనిపై తక్షణ చర్యలు చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు బయ్యే మల్లయ్య, తదితరులు ఒత్తిడి తేవడంతో యాజ మాన్యం ఆయనను సస్పెండ్ చేసింది.

ఉద్యోగం ఇస్తానని చెప్పి టోకరా

కంచరపాలెం, ఫిబ్రవరి 5 : న్యూజిలాండ్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని యువకుడినుంచి రూ.8 లక్షలు తీసుకుని మోసగించిన ఘటన చోటుచేసుకుంది.కంచరపాలెం కప్పరాడ ప్రాంతంలో ఉంటున్న లగుడు రవీంద్ర ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నారు. రవీంద్రకు తన స్నేహితుని ద్వారా హైదరాబాద్‌లో ఉంటున్న వలమాడ మోహన్‌కుమార్ పరిచయమయ్యాడు. ఈ క్రమంలో మోహన్‌కుమార్ న్యూజిలాండ్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని రవీంద్ర వద్ద రూ.8లక్షలు తీసుకున్నాడు.నకిలీ వీసాను సృష్టించి రవీంద్రకు ఇచ్చారు. చివరికి తాను మోసపోయిన ట్టు రవీంద్ర గుర్తించారు. దీంతో ఆయన కంచరపాలెం పోలీసులను ఆశ్రయించాడు. ఎస్ఐ దివ్యభారతి దర్యాప్తు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు.

పాత పింఛన్‌పై హామీ ఇచ్చే పార్టీకే మద్దతు: యూటీఎఫ్



పోస్టర్లు ప్రదర్శిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

మద్దిపాలెం, ఫిబ్ర వరి 5: పాత పింఛన్ పునరుద్ధరణపై హామీ ఇచ్చే పార్టీకే ఉద్యోగ, ఉపాధ్యాయుల మద్దతు ఉంటుందని యూటీఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టి. ఆర్. అంబేడ్కర్ అన్నారు. సోమ వారం యూనియన్ జిల్లా కార్యాలయంలో ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్లను ఆవి ష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగిగా జీవితకాలం సే వలందించి, పదవీ విరమణ తర్వాత భద్రత కోసం పోరాడి సాధించుకున్న పెన్షన్ ఓపీఎస్‌ను రద్దు చేసి సీపీఎస్, జీపీఎస్ అంటూ చలగాటం ఆడుతున్నారని విమర్శించారు. ఈ స్థితిలో రానున్న ఎన్నికల్లో ఏపార్టీ అయితే పాత పిం ఛన్ పునరుద్ధరిస్తామని హామీ ఇస్తారో వారికే ఓటు వేసేలా ప్రజల్లో ప్రచారం తీసుకువెళ్తామన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాడానా అ ప్పారావు, జిల్లా గౌరవ అధ్యక్షులు అనకాపల్లి పైడిరాజు, ఉపాధ్యక్షులు రొంగలి ఉమా, కోశాధికారి కె.రాంబాబు, జిల్లా కార్యదర్శులు చుక్కా సత్యం, రియాజ్ అహ్మద్, ఎం.రాంబాబు, బి.జనార్ధన్, ఎన్.సూరిబాబు, పెందుర్తి, గాజువాక మం డలాల అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ విధానాలతోనే మణిపూర్‌లో అంతర్యుద్ధం'



పుస్తకావిష్కరణలో వక్తలు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 5: దేశంలో నెలకొన్న రాజకీయ వాతావరణం, బీజేపీ అనుసరిస్తున్న నిరంకుశ విధానాల వల్లే మణిపూర్‌లో తెగల మధ్య అంతర్యుద్ధానికి కారణమని వక్తలు అభిప్రాయం వ్యక్తంచేశారు. సోమవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో 'అంతర్యుద్ధంలో మణిపూర్ పుస్తకావిష్కరణ' సభ నిర్వహించారు. ముందుగా డా. జోస్ మాలేకల్ పుస్తకావిష్కరించి తొలి ప్రతిని డా.కృష్ణమూర్తికి అందించారు. అనంతరం సభకు అధ్యక్షత వహించిన మహిళా చేతన ప్రధాన కార్యదర్శి కత్తి పద్మ మాట్లాడుతూ.. మణిపూర్‌లో ఇటీవల పర్యటించామన్నారు. అక్కడి పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయని వివరించారు. నిర్బంధం మధ్య అక్కడి ప్రజలు జీవిస్తున్నారన్నారు. అక్కడి అంశాలపై రచించిందే ఈ అంతర్యుద్ధం మణిపూర్ అని వివరించారు. డా.జోస్ మాలేకల్ పుస్తకాన్ని పరిచయం చేశారు. న్యాయవాది జహా ఆరా తమ పర్యటన అనుభవాలు తెలిపారు.పుస్తకాన్ని ప్రొఫెసర్‌సత్యపాల్ సమీక్షించారు.

ఆకట్టుకున్న వైమానిక ప్రదర్శన



ప్రదర్శనలో 30వ సీ కెడిట్ క్రాఫ్ట్

గోపాలపట్నం, ఫిబ్రవరి 5: ఐఎన్ఎస్ డేగాలో సోమవారం నిర్వహించిన వైమానిక ప్రదర్శన అబ్బురపరచిం ది. చేతక్ ఎయిర్ క్రాఫ్ట్, వైమానిక ప్రదర్శనలతోపాటు అగ్నిమాపకానికి సంబంధించి ప్రదర్శనల్లో 30వ సీ కెడిట్ క్రాఫ్ట్ పాల్గొన్నారు. భద్రతా దళ సిబ్బంది తమ సాహసోపేత ప్రదర్శనలతో ఎంతగానో ఆకట్టుకున్నారు.

'మంత్రి అమర్ రూ.కోట్లు సంపాదించారు.. అందుకే టికెట్ నిరాకరణ'

సీతంపేట, ఫిబ్రవరి 5: రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్ ..ముఖ్యమంత్రి జగన్ పేరు చెప్పి ఆయనకు తెలియకుండా రూ.500 కోట్లు సంపాదించడంవల్లే రానున్న ఎన్నికల్లో పోటీ చేయడానికి వీలుగా ఎమ్మెల్యే టికెట్ కేటాయించడం లేదని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రులలో వయసులో చిన్న అయిన అమర్‌కు ఎంతో ప్రేమతో ముఖ్యమంత్రి కీలకమైన శాఖలు అప్పగిస్తే.. మం త్రులు, చివరకు ముఖ్యమంత్రి షాక్ అయ్యే విధంగా వందల కోట్లు సంపాదించారన్నారు. ఇప్పుడు ఎమ్మెల్యే, ఇటు ఎంపీ టికెట్ లేకుండా పోతోందన్నారు. అందుకే తన తలరాత జగన్ రాస్తారంటూ మెట్ట వేదాంతం వల్లిస్తున్నారని ఎద్దేవా చేశారు. గంగవరం పోర్టును జగన్ అమ్మేస్తే.. అందులోని రూ.200 కోట్ల స్క్రాప్‌ను అమర్ వి క్రయించారని ఆరోపించారు.ఈ సమావేశంలో ఉత్తరాంధ్ర సమన్వయకర్తలు నాగలక్ష్మి చౌదరి, త్రివేణి రవి పాల్గొన్నారు.

సృజనాత్మకత కోసమే ఎగ్జిబిషన్



ప్రదర్శనలో చిన్నారులు

మురళీనగర్, ఫిబ్రవరి 5 ; ఎన్‌జీజీఓస్ కాలనీలోని మురళీనగర్ రవీంద్రభారతి పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ అలరించింది. బాలల్లో సృజనాత్మకత వెలికితీతకు ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు ప్రిన్సిపల్ బి.గాయత్రిదేవి పేర్కొన్నారు. బొమ్మలు, కళాఖండాలు ప్రదర్శించారు. రవీంద్రభారతి పాఠశాలల చైర్మన్ ఎం.ఎస్.మణి, జోనల్ ఇన్‌చార్జి వెంకటేష్ ఉన్నారు.

నిలిచిన రిజిస్ట్రేషన్లు

... 3వ పేజీ తరువాయి

రిజిస్ట్రేషన్లకు ఏర్పాటుచేశారు. సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చి, వారి సంతకాలు చెల్లుబాటు అయ్యేలా చట్టం ప్రకారం వారికి కూడా రిజిస్ట్రేషన్ అధికారం కల్పించారు. వచ్చే నెలలో ఎన్నికల ప్రకటన రానున్న నేపథ్యంలో ఈలోగానే ఈ సెంటు భూముల రిజిస్ట్రేషన్ పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేవలం నెల రోజుల్లో 26 లక్షల రిజిస్ట్రేషన్లు చేయాలి. ఇటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, అటు గ్రామ సచివాలయాలు ఒకేసారి సర్వర్ వినియోగించడం వల్ల ఒత్తిడి పెరిగి అది స్తంభించిపోతోంది. ఇటీవల వారంలో ఒకటి, రెండు రోజులు ఇలాగే జరుగుతుంది. సోమవారం మాత్రం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సర్వర్ పూర్తిగా డౌన్ అయిపోయింది. అదే సమయంలో సచివాలయాల సర్వర్ ఊపందుకుని బాగానే పనిచేసింది. అంటే సెంటు భూముల రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సర్వర్‌ను డౌన్ చేశారని ఆ శాఖ వర్గాలు అనుమానిస్తున్నాయి. తమకు మాత్రం ఈ-సంతకం వద్ద డాక్యుమెంట్ ఆగిపోయి, సచివాలయాల్లో ఆ సమస్య తలెత్తకుండా ప్రాసెస్ పూర్తి అవుతున్నదంటే దాని అర్థం ఆ సర్వర్‌కు లైన్ క్లియర్ చేసి, డిపార్టుమెంట్ వ్యవహారాలకు కావాలనే కాసింత విరామం ఇచ్చినట్టుగా ఉందని భావిస్తున్నారు. వారంలో ఒకటి, రెండు రోజులు ఇలాగైతే ఫరవాలేదని, కానీ రోజూ ఇదే సమస్య ఏర్పడితే రిజిస్ట్రేషన్లకు వచ్చే వారి నుంచి ఇబ్బందులు తప్పవని అధికార వర్గాలు చెబుతున్నాయి. సచివాలయాల్లో డాక్యుమెంట్ల అప్‌లోడింగ్ వంటివి ఏమీ లేకుండా లబ్ధిదారుడి ఈకేవైసీ, సిబ్బంది ఈ-సంతకం చేస్తే సరిపోతుంది. దాంతో అక్కడ సోమవారం ఏ ఇబ్బంది లేకుండా సెంటు భూముల రిజిస్ట్రేషన్లు జరిగాయి. రాష్ట్రంలో సెంటు భూముల రిజిస్ట్రేషన్లు సుమారు 16 వేలు మాత్రమే జరిగాయి. ఇంకా 25.5 లక్షల వరకు చేయాల్సి ఉంది. దానికి ఈ నెల 15వ తేదీ గడువు పెట్టారు. ఆ లక్ష్యం కోసం అమరావతి అధికారులు ఇంకేమి చేస్తారోనని ఆ శాఖలో చర్చ జరుగుతోంది.

హడలిపోతున్న అధికారులు

... 3వ పేజీ తరువాయి

రూ.100 కోట్ల విలువ చేసే భూమి రూ.18 కోట్లకే వస్తున్నదని దళారి చెప్పడంతో ఎమ్మెల్యే అడ్వాన్స్ ఇచ్చేశారు. ఆ భూమి యజయాని అమెరికాలో ఉండగా వారికి తెలియకుండా ఎమ్మెల్యే కుమారుడి పేరిట రిజిస్టర్ చేయడానికి యత్నించారు. అక్కడ ఎకరా భూమి ప్రభుత్వ ధర ఆనాడు రూ.2.2 కోట్లు ఉండగా దానిని రూ.1.53 కోట్లు చొప్పున రిజిస్టర్ చేయాలని, ఆ మొత్తానికే ఫీజులు కట్టించుకోవాలని సబ్ రిజిస్ట్రార్‌పై ఒత్తిడి పెట్టారు. అలాగే ఆ భూమి పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయం సిబ్బందిని బెదిరించారు. ఈ కేసులో ఎమ్మెల్యే కూడా మోసపోయారు. అయితే తనకు అనుకూలంగా చేయాల్సిందిగా అధికారులను బెదిరించారు.

నేను వచ్చానంటే అర్థం చేసుకోవాలి

నగరంలో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇప్పుడు నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా ఉన్నారు. భీమిలి, భోగాపురం, ఆనందపురం ఇలా చాటాచోట్ల ఆయన వెంచర్లు ఉన్నాయి. వీటికి సంబంధించిన రిజిస్ట్రేషన్ విషయంలో ఓ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. అది ప్రభుత్వ భూమి అని, సర్వే నంబరు సబ్ డివిజన్ జరిగిందని, ఆ వివరాలు తీసుకువస్తే రిజిస్ట్రేషన్ చేస్తామని సదరు అధికారి వివరించారు. దానికి ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. 'నేను వచ్చానంటే అర్థం చేసుకోవాలి. పని చేసి పెట్టాలి' అంటూ రంకెలు వేశారు. అక్కడితో ఆగకుండా డబ్బులు ఇస్తే చేసేస్తావా?నీ సంగతి తేలుస్తా!!' అంటూ హెచ్చరించారు.

చెట్టుకు వేలాడ దీస్తా

పక్క జిల్లాలో సీనియర్ మంత్రి ఉన్నా అధికారులంతా అధికార పార్టీకి చెందిన ఆ నాయకుడు చెప్పినట్టు వినాల్సిందే. ఆ జిల్లాకు, విశాఖ జిల్లాకు సరిహద్దుల్లోని భూముల లావాదేవీల విషయంలో ఓ సబ్ రిజిస్ట్రార్ నిబంధనల ప్రకారం చేయలేమని చెప్పడంతో తీవ్రస్థాయిలో బెదిరించారు. 'పిచ్చి వేషాలు వేస్తే...చెట్టుకు వేలాడ దీస్తా' అంటూ హెచ్చరించారు. భీమిలి, గాజువాక, ఆనందపురం మండలాలతో పాటు అక్కడి సబ్ రిజిస్ట్రార్లకు కూడా ఇలాంటి బెదిరింపులు చాలానే వచ్చాయి. కొందరు అక్కడి నుంచి బదిలీ చేయించుకొని వెళ్లిపోతే, మరికొందరు ఆ కార్యాలయాలకు వెళ్లడానికి నిరాకరించి వేరే ప్రాంతాల్లో పోస్టింగులు వేయించుకున్నారు. ఏదేమైనా విశాఖపట్నంలో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో రాజకీయ నాయకులు ఎక్కువ సంఖ్యలో ఉండడం, ప్రభుత్వ భూములను ఆక్రమించడం వల్ల బెదిరింపులు అధికం అయ్యాయనేది కాదనలేని వాస్తవం.

భారత్ హ్యాట్రిక్

... 3వ పేజీ తరువాయి

హార్ట్‌లీ (36) కలిసి ఎనిమిదో వికెట్‌కు 50 పరుగులు జోడించి భారత్ బౌలర్లకు సహన పరీక్ష పెట్టారు. బెన్ ఫోక్స్‌ను బుమ్రా అవుట్ చేయగా, ఫోక్స్ స్థానంలో వచ్చిన షోయబ్ బషీర్ (0) కొద్దిసేపటికే ముకేష్‌కుమార్ బౌలింగ్‌లో కీపర్ భరత్‌కు క్యాచ్ పట్టడంతో అవుటయ్యాడు. చివరిగా టామ్ హార్ట్‌లీని బుమ్రా క్లీన్ బౌల్డ్ చేయడంతో ఇంగ్లంగ్ రెండో ఇన్నింగ్స్ 292 పరుగుల వద్ద ముగిసి ఓటమి చెందింది.

ఇంగ్లండ్ బ్యాటింగ్‌ను చుట్టేసిన బుమ్రా, అశ్విన్

ఫాస్ట్ బౌలర్ బుమ్రా, స్పిన్ మాంత్రికుడు అశ్విన్‌లు టీ విరామ సమయానికి ముందే ఇంగ్లండ్ బ్యాటింగ్‌ను చుట్టేశారు. తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు తీసిన బుమ్రా...రెండో ఇన్నింగ్స్‌లో కూడా పదునైన బంతులతో మూడు వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ తీయలేకపోయినా అశ్విన్...రెండో ఇన్నింగ్స్‌లో మూడు కీలక వికెట్లు పడగొట్టి టెస్టు కెరీర్‌లో 499 వికెట్ల మైలురాయిని చేరుకున్నాడు.

కరతాళ ధ్వనులతో ప్రేక్షకులు

హైదరాబాద్‌లో జరిగిన తొలి టెస్టులో ఓటమి చెందిన భారత్...ఇక్కడ జరిగిన రెండో టెస్టులో ఒకరోజు మిగిలి ఉండగానే అద్భుతమైన గెలుపుతో ప్రతీకారం తీర్చుకుని సిరీస్‌ను సమం చేసింది. చివరి వికెట్‌గా టామ్ హార్ట్‌లీని బుమ్రా క్లీన్ బౌల్డ్ చేసిన వెంటనే స్టేడియం హోరెత్తింది. ప్రేక్షకులు స్టాండ్స్‌లో నిలబడి భారత్ ఆటగాళ్ల డెస్సింగ్ రూమ్‌కు వెళ్లేంత వరకూ చప్పట్లతో అభినందనలు తెలిపారు.

ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా బుమ్రా

రెండు ఇన్నింగ్స్‌లో తొమ్మిది వికెట్లు పడగొట్టి భారత్ జట్టు విజయంలో కీలకపాత్ర వహించిన బుమ్రా ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ (209) చేసిన యశస్వి జైస్వాల్, రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ (104) చేసిన శుభమన్ గిల్ ఉత్తమ బ్యాట్స్‌మెన్ అవార్డు అందుకున్నారు.

అంతా గోప్యం

... 3వ పేజీ తరువాయి

నిర్మించిన అపార్టుమెంట్‌కు సంబంధించిన భూమికి కన్వేయన్స్ డీడ్ కోసం గంగారాం ప్రయత్నించాడా? లేకపోతే వేరొక భూమికి సంబంధించిన డీడ్ కోసం యత్నించాడా?...అనే వివరాలు విలేకరులు అడిగినా సీపీ సమాధానం చెప్పకుండా దాటవేశారు. విచారణలో వెల్లడించిన వివరాలను రెవెన్యూ అధికారులు, ఇతర విభాగాల సీనియర్ అధికారులతో చర్చించి నిర్ధారించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నిందితుడు దొరక్కముందు చెప్పిన విషయాలనే రెండు రోజుల తర్వాత సీపీ చెప్పడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

ఇదిలావుండగా నిందితుడు గంగారాం మొదట్లో ప్రస్తుతం పనిచేస్తున్న నిర్మాణ సంస్థకు బీచ్‌రోడ్డులో గల హోటల్ వ్యవహారాలు చేసేవాడని, ఆ సమయంలో హోటల్ యజమాని తానేనంటూ పలువురి వద్ద నుంచి డబ్బులు వసూలుచేసి మోసం చేసినట్టు తెలిసింది. తర్వాత డబ్బులు ఇచ్చినవారంతా ఒత్తిళ్లు చేయడంతో హోటల్ వదిలేసి పారిపోతే, యాజమాన్యమే తిరిగి అతడిని నగరానికి తీసుకొచ్చిందని, తమ నిర్మాణ రంగ సంస్థలో మేనేజర్‌గా ఉద్యోగం ఇచ్చిందని సమాచారం. ఆ సంస్థ తరఫున రెవెన్యూ, పోలీస్ శాఖలతో అవసరమైన పనులు గంగారాం చక్కబెడుతుంటాడని తెలిసింది. ఏదిఏమైనా పోలీసులు ఈ కేసులో గోప్యత పాటించడం, ఆ శాఖలోని కొద్దిమందికి తప్ప ఎవరికీ తెలియని ప్రాంతంలో రహస్యంగా విచారణ జరపడం, నిందితుడు వెల్లడించిన అంశాలను కూడా బయటకు చెప్పకపోవడంపై పలు రకాల ప్రచారాలు జరుగుతున్నాయి.

ఆరోగ్యం బాగాలేదు...అప్రాధాన్య పోస్టు ఇవ్వండి

... 3వ పేజీ తరువాయి

అయిన సనపల రమణయ్య ఈనెల రెండో తేదీ రాత్రి కొమ్మాదిలో హత్యకు గురైన విషయం తెలిసిందే. రూరల్ మండలంలో అనేక భూములు వివాదాల్లో ఉన్నాయి. నిత్యం కోర్టు కేసులకు హాజరుకావాల్సి ఉంది. ఇంకా రాష్ట్ర స్థాయిలో అనేకమంది రాజకీయ ప్రముఖులకు ఈ మండలంలో భూములు ఉండడంతో అనవసరంగా ఇబ్బందులు పడాల్సి వస్తోందనే శ్రీనివాస మిశ్రా రూరల్ తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించడానికి వెనుకంజ వేసి ఉంటారని రెవెన్యూ వర్గాల్లో ప్రచారం సాగుతుంది.

విశాఖను వైసీపీ నేతలు దోచుకున్నారు

... 3వ పేజీ తరువాయి

మరింత ఉత్సాహపరిచారు. కాగా 'రా..కదలిరా' సభకు టీడీపీ నాయకులు ఊహించని దానికన్నా ఎక్కువ మంది హాజరయ్యారు. దీంతో సభా ప్రాంగణం మొత్తం నిండిపోగా, ఇంకా చాలామంది రోడ్లపైనే వుండాల్సి వచ్చింది. దీంతో వెంకన్నపాలెం-కె.కోటపాటు రోడ్డులో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. సభాస్థలి నుంచి చౌడువాడ వరకు వాహనాలు బారులు తీరాయి.

చంద్రబాబుకు నీరాజనం

... 3వ పేజీ తరువాయి

చంద్రబాబుకు స్వాగతం పలికారు. అనంతరం 11:55 గంటలకు చంద్రబాబు వేదికపైకి వచ్చారు. దీంతో సభా ప్రాంగణం మొత్తం జైబాబు, జైజై బాబు అంటూ నినాదాలతో హోరెత్తింది. వేదికపై ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహానికి చంద్రబాబు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సుమారు గంటన్నరపాటు ఏకధాటిగా ప్రసంగించారు. గత ఎన్నికల్లో జగన్ మాయమాటలు నమ్మి ప్రజలు అధికారం ఇచ్చి మోసపోయారని, మళ్లీ ఇప్పుడు సిద్ధం అంటూ వస్తున్నాడని, ఇంకోసారి అవకాశం ఇస్తే రాష్ట్రం సర్వనాశనం అవుతుందని చంద్రబాబు అన్నారు. వైసీపీ అరాచక పాలనను అంతమొందించి జగన్‌ను ఇంటికి పంపడానికి యువత, మహిళలు, రైతులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలో తెలుగు వారిని నంబర్ వన్‌గా ఉంచాలన్నదే తన లక్ష్యమని, రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్క కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. సభకు ఇంత పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చి ఎన్నికల యుద్ధానికి తాము సిద్ధమని సంకేతాలు పంపితే తాడేపల్లి పిల్లికి జ్వరం వస్తుందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం, వైసీపీ అరాచక పాలనను అంతం చేయడానికి ప్రతిఒక్కరూ ఒక స్టార్ క్యాంపెయినర్‌గా మారాలని పిలుపునిచ్చారు. పేదల భూములు కొట్టేయడానికి వైసీపీ కొత్తగా తెచ్చిన భూ చట్టాన్ని టీడీపీ అధికారంలోకి వచ్చాక రద్దు చేస్తానన్నారు.

చంద్రబాబుకు ఘన స్వాగతం....

అంతకుముందు ఉదయం 11.45 గంటలకు హెలీకాప్టర్‌లో గొండుపాలెం చేరుకున్న చంద్రబాబునాయుడుకి టీడీపీ, జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు. చంద్రబాబు హెలీప్యాడ్‌లో దిగగానే కార్యకర్తలు, నాయకులు భారీసంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు చింతకాయల అయ్యన్నపాత్రుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, తెలుగుమహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, టీడీపీ నాయకులు దాడి వీరభద్రరావు, పప్పల చలపతిరావు, పీవీజీ కుమార్, బత్తుల తాతయ్యబాబు, ప్రగడ నాగేశ్వరరావు, పీలా గోవింద సత్యనారాయణ, గవిరెడ్డి రామానాయుడు, కేఎస్ఎన్ఎస్ రాజు, బైరా ఫౌండేషన్ చైర్మన్ బైరా దిలీప్‌చక్రవర్తి, దాడి రత్నాకర్, లాలం కాశినాయుడు, రొంగలి మహేశ్, దాడి ఎరుకునాయుడు, జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు, ఆ పార్టీ నాయకులు సుందరపు విజయ్‌కుమార్, రాయపురెడ్డి కృష్ణ, బి.శివదత్, పీవీఎస్ఎన్ రాజు, సూర్యచంద్ర, తదితరులు చంద్రబాబుకు స్వాగతం పలికారు.

దళిత ద్రోహి జగన్

▸▸ మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్



'దళిత సింహగర్జన' పోస్టర్ ఆవిష్కరిస్తున్న హర్షకుమార్, నాయకులు

డాబాగార్డెన్స్ (విశాఖపట్నం), ఫిబ్రవరి 5: రాష్ట్రంలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను మళ్లించి, సంక్షేమ పథకాల్లో కోత విధిస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దళిత ద్రోహిగా మారారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ విమర్శించారు. ఈ నెల 11వ తేదీన రాజమహేంద్రవరంలో నిర్వహించనున్న 'దళిత సింహ గర్జన' సభకు సంబంధించిన పోస్టర్లను సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హర్షకుమార్ మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో దళితులకు సంబంధించి 27 సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం తొలగించిందన్నారు. దళితుల సబ్ ప్లాన్ నిధులు అమ్మఒడికి కేటాయిస్తున్నారన్నారు. దళితులు జగన్‌ను 420గా భావిస్తున్నారన్నారు. దళిత నాయకులు పి.పెంటారావు, సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

మహిళలు వృత్తివిద్యపై దృష్టిసారించాలి

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 5: మహిళలు చదువుతో పాటు వృత్తివిద్యలపై ప్రావీణ్యం సాధించాలని బ్యాంకర్ గ్రామీణ మరియు ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ (బీఐఆర్‌ఈడీ) అసిస్టెంట్ డైరెక్టర్ డి.శ్రీనివాస్ అన్నారు. బీఐఆర్‌ఈడీ, భెల్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో తుంగ్లాంలోని సత్యసాయి మందిరంలో సోమవారం మహిళలకు మగ్గం, జర్దోసి ఉచిత శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు వృత్తివిద్య ద్వారా స్వయం సాధికారత సాధించవచ్చన్నారు. 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి మాట్లాడుతు ఇటువంటి శిక్షణ శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రతినిధులు కె.నాగప్రసాద్, బి.అమ్మాజీ, పీఆర్ఎస్ఎన్ నాయుడు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

జోనల్ అధికారులతో కమిషనర్ సమీక్ష

గాజువాక, ఫిబ్రవరి 5: గాజువాక జోనల్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో సోమవారం జెడ్సీ పీవీవీడీ ప్రసాదరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. జోనల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, రెవెన్యూ, పారిశుధ్యం, నీటి సరఫరా, తదితర అంశాలపై చర్చించారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు లేకుండా అన్ని పనులు పక్కాగా చేపట్టాలని సూచించారు.

ఘనంగా పెంటమాంబ పరస



అమ్మవారి సన్నిధిలో ఆలయ కమిటీ ప్రతినిధులు

అగనంపూడి, ఫిబ్రవరి 5: జీవీఎంసీ 85వ వార్డు ఫార్మాసిటీ పునరావాస కాలనీ దొప్పవానిపాలెం ప్రజల ఆరాధ్య దేవత పెంటమాంబ అమవారి పరసను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వేకువజామునే అమ్మవారిని ప్రత్యేక పుష్పాలు, నూతన వస్త్రాలతో అలంకరించి తొలిపూజ చేశారు. అనంతరం అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో జరిగిన పరసలో సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టీడీపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి ఏదూరి గౌరినాయుడు, ఆలయ కమిటీ ప్రతినిధులు దొప్ప పైడిరాజు, డి.ఆనంద్, చిన వెంకటరమణ, వై.వెంకటరమణ, ఎస్.ఆనంద్, ముత్యాలు, శ్రీను, మాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

91వ వార్డుకు స్వచ్ఛత సేవా అవార్డు

గోపాలపట్నం, ఫిబ్రవరి 5: విశాఖ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు పిలుపునిచ్చారు. ఎనిమిదవ జోన్ పరిధిలోని 91వ వార్డుకు స్వచ్ఛత సేవా అవార్డు-24లో ద్వితీయ స్థానం లభించడంతో సిబ్బందిని బెహరా అభినందించారు. ఈ సందర్భంగా లభించిన రూ.10 లక్షల చెక్‌ను జోన్ ఏఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణంరాజు, ప్రజారోగ్య విభాగం అధికారులకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో జోన్ ప్రజారోగ్య వి భాగ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **అంబాజీపేట మ్యారేజి బ్యాండు :** మెలోడి, రమాదేవి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), సప్తగిరి (తగరపువలస)
- **బూట్‌కట్ బాలరాజు :** మోహిని (గాజువాక),
- **ధీర :** కిన్నెర, మౌర్య (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **కిస్మత్ :** కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), విశేష్ (గాజువాక),
- **కెప్టెన్ మిల్లర్ :** వెంకటేశ్వర
- **నా సామిరంగ :** శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, సంగం, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 19, టమాటా 32, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 54, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 44, బీరకాయలు 54, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 22, క్యాబేజ్ 18, క్యారెట్ 24, దొండకాయలు 36, బంగాళదుంపలు 22, అరటికాయ (పె)4, మునక్కాడలు (కిలో) 95, అల్లం (పాతది) 110, బరబాటి 26, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 36, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 340, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 50, ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 32, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 56, చిలగడదుంపలు 28, కంద 54, దేముడు చిక్కుడు 30, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, క్యాప్రెండలం 20, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	97
ఫారం ధర	--	117
విత్ స్కిన్	--	204
స్కిన్‌లెస్	--	214

మరికొన్ని సిటీ వార్తలు పేజీ IVలో..

7, 8 తేదీల్లో ఢిల్లీలో 'ఉక్కు' ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 5: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న ఆందోళనలో భాగంగా ఈ నెల 7, 8 తేదీల్లో ఢిల్లీలో ధర్నా చేయనున్నారు. ఈ మేరకు ఉక్కు కార్మిక నాయకులు, పోరాట కమిటీ ప్రతినిధులు సోమవారం ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఇప్పటికే పలు రూపాల్లో ధర్నా చేయటం, గతంలో ఒకసారి ఢిల్లీలో ధర్నా చేసిన సమయంలో వైసీపీ ఎంపీలు కూడా పాల్గొని మద్దతు తెలిపినా కేంద్రంపై మాత్రం నిరసన వ్యక్తం చేయలేదు. అయితే ఈసారి ఆందోళనను తీవ్ర స్థాయిలో చేస్తామని పోరాట కమిటీ నాయకులు తెలిపారు. దేశంలోనే పేరొందిన స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తామని 2021 జనవరి 27న కేంద్రం నిర్ణయించింది. దీంతో ఉక్కు కార్మిక సంఘాలు, అధికారుల సంఘం, వివిధ అసోసియేషన్లు ఏకమై ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీగా ఏర్పడి పోరాటాలను ప్రారంభించింది.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని కేంద్రం ప్రకటించాలని పోరాట కమిటీ నేతల డిమాండ్



అదే ఏడాది ఫిబ్రవరి 12న స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద రిలే నిరాహార దీక్షలను ఆరం భించి.నాటినుంచి నేటి వరకు వివిధ రూపాల్లో ప్లాంట్ పరిరక్షణ కోసం ఆందోళనలను చేస్తూనే ఉన్నారు. ఉక్కు ఉద్యమాన్ని కేవలం విశాఖకే పరిమితం చేయకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి పోరాట కమిటీ ప్రతినిధులు అక్కడ సభలు నిర్వహిస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకునేందుకు అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేలా కోటి సంతకాల సేకరణను కూడా చేపట్టారు. 32 మంది ప్రాణ త్యాగాల ఫలితం, ఉక్కు నిర్వాసితుల భూ త్యాగం వల్ల నిర్మితమైన స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం విరమించుకోవాలని, ఉక్కును ప్రభుత్వ రంగలోనే కొనసాగిస్తామని స్పష్టమైన ప్రకటన చేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

దుర్మార్గంగా వ్యవహరిస్తున్న కేంద్రం



స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుంది. ప్రజాభిప్రాయాన్ని గౌరవించడం లేదు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడే ఏ ప్రభుత్వం మనుగడ సాధించలేదు. కేంద్రానికి కార్మిక వర్గం బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయి. ఢిల్లీలో చేపట్టే ధర్నా ద్వారా కేంద్రంపై మరింత ఒత్తిడి తెస్తాం.

-యెల్లేటి శ్రీనివాసరావు, పోరాట కమిటీ నాయకుడు

ఢిల్లీ పయనమైన సీఐటీయూ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ ఢిల్లీలో ఈ నెల ఏడు, ఎనిమిది తేదీల్లో నిర్వహించనున్న ధర్నాలో పాల్గొనేందుకు సీఐటీయూ ప్లాంట్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు సోమవారం ఢిల్లీ బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంగ్లేయులను తలపించేలా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయని మండిపడ్డారు. అంబానీ, అదానీలకు ప్రభుత్వ రంగ సంస్థలను కట్టబెట్టి దేశ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యోచిస్తుందన్నారు. రాష్ట్ర సంపదను పరిరక్షించడంలో సీఎం జగన్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. ఢిల్లీ వెళ్లిన వారిలో నాయకులు యు.రామస్వామి, వైటీ దాస్, శ్రీనివాసరాజు, సతీశ్, అప్పలరాజు, శ్రీనివాస్, శివ, తదితరులు ఉన్నారు.



దువ్వాడ రైల్వే స్టేషన్‌లో సీఐటీయూ ప్లాంట్ నాయకులు

గణితం, సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ

పెదగంట్యాడ, జనవరి 5: నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం డివిజనల్ స్థాయిలో గణితం, సైన్స్ ఉపాధ్యాయులకు సిమ్యులేషన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. టెక్నాలజీ, ఇంటర్నెట్‌ను ఉపయోగించి ఐఎఫ్‌పీ ప్యానెల్ ద్వారా ఇంటరాక్టివ్ మెథడ్స్‌లో విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధనా విధానం గురించి సాంకేతిక నిపుణులు వివరించారు. పీహెచ్‌ఈటీ సిమ్యులేషన్స్, ఓల్యాబ్స్, రేబో కంపాస్, ఇంటరాక్ట్ వీడియో ప్రిపరేషన్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెంట్ టూల్స్, క్విజ్ పేపర్ మోడ్, జియో జీబ్రా, ఇంటరాక్ట్ కమ్యూనికేషన్ టూల్స్ వంటి అంశాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపవిద్యాశాఖాధికారి గౌరీ శంకర్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతికి ఐసీటీ టూల్స్ ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ఈ మేరకు విద్యార్థులను మంచి తర్ఫీదునివ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు శ్రీనివాస్, రమణాజీ, కోర్సు డైరక్టర్‌గా వ్యవహరించిన హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఆర్.శ్రీనివాస్, రిసోర్స్ పర్సన్లు సూర్యకిరణ్, సురేశ్, బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.



పెదగంట్యాడ జెడ్పీ హై స్కూల్‌లో శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

'కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలి'

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 5: కార్మికులంతా ఐక్య పోరాటాలతో కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1,089వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేసి దేశానికి ఓ సందేశం పంపాలన్న బీజేపీకి పెద్ద విఘాతం కలిగిందన్నారు. కార్మిక వర్గమంతా ఆత్మవిశ్వాసంతో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేఎస్ఎన్ రావు, మస్తానప్ప, జె.రామకృష్ణ, గణపతిరెడ్డి, గంగవరం గోపి, పి.సోమునాయుడు, వి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు

సనాతన ధర్మం సెల్ ఏర్పాటు

అగనంపూడి, ఫిబ్రవరి 5: జీవీఎంసీ 85వ వార్డు పరిధి గొన్నవానిపాలెంలో గల గొన్నా విద్యా సంస్థలో సోమవారం సనాత ధర్మం సెల్‌ను ఏర్పాటు చేశారు. కళాశాల కార్యదర్శి గొన్న హేమచంద్‌నాయుడు ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో నైతిక, మానవీయ విలువలను పెంపొందించాలన్న లక్ష్యంతో పాటు మన పురాణాలు, ఇతిహాసాలు, మన సంస్కృతీ సంప్రదాయాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడానికి సనాతన ధర్మం సెల్‌ను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం యోగా గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీఎస్ఎస్ మూర్తి, అధ్యాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నా వీడని నిర్లక్ష్యం

- ప్రమాదకరంగా వేపగుంట- పినగాడి రహదారి
- ఇటీవల గుంతల్లో బైక్‌పైనుంచి జారి పడి నవ వధువు మృత్యువాత
- రోడ్డు నిర్మాణం పట్టించుకోని పాలకులు

పెందుర్తి, ఫిబ్రవరి 5: వేపగుంట నుంచి పినగాడి రహదారి ప్రమాదకరకర స్థితిలో ఉంది. వివాహమైన కొద్దిరోజుల్లో భర్తతో చీమలాపల్లిలోని కన్నవారింటికి వెళ్లి వస్తుండగా ఈమార్గంలో గుంతల్లో బైక్‌పైనుంచి నవ వధువ సంతోషి గత నెల 19న గాయపడి మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఈ రోడ్డు ఏ స్థితిలో ఉందో ఈ ఉదంతం ఒక్కటి చాలు . అడుగుకో గోతితో ఆరు కిలో మీటర్ల మేర దయనీయస్థితిలో ఈ మార్గం ఉంది. నగరం నుంచి వేపగుంట మీదుగా చీమలాపల్లి నుంచి పినగాడి జంక్షన్‌కు చేరుకుని అక్కడినుంచి చోడవరం, అనకాపల్లి వెళ్లేందుకు ఇది దగ్గర రహదారి. 20 గ్రామాలకు అనుసంధానంగా ఈ మార్గంలో నిత్యం భారీ, చిన్న, ద్విచక్ర వాహనాలు ప్రయాణిస్తుంటాయి. గతుకులతో ప్రయాణం ప్రాణాంతకంగా మారుతోంది. ఈస్థితిలో గత ఏడాది నాబార్డు నిధులు రూ. కోటితో అభివృద్ధి చేయడానికి స్థానిక ఎమ్మెల్యే అదీప్‌రాజ్ శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ మెటీరియల్ డంప్ చేసి పనులు ప్రారంభించి మధ్యలోనే వదిలేశారు. బిల్లులు కాకపోవడంతోనే పనులు చేపట్టడానికి ఆసక్తి చూపడంలేదని తెలుస్తోంది. ప్రస్తుతం ఈరోడ్డు మీద ప్రయాణం నరక ప్రాయంగా మారుతోంది. ఈ మార్గంలో ప్రయాణిస్తూ కొంతమంది మృతి చెందగా పదుల సంఖ్యలో గాయపడ్డారు. నవ వధువు సంతోషి మృతితో ట్రాఫిక్ ఎస్ఐ రమేశ్‌స్పందించి రహదారి గుంతలు పూడ్చారు. కొద్దిరోజుల్లోనే మళ్లీ యథాస్థితికి చేరాయి. ఇప్పటికైనా ఈ రహదారి పనులు పూర్తిచేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులను పలు గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



ఛిద్రమైన పినగాడి వెళ్లే రహదారి

జెడ్సీ దృష్టికి బిల్డింగ్ అసోసియేషన్ సమస్యలు

వేపగుంట ఫిబ్రవరి 5: ఎన్.ఎ.డి. నుంచి పెందుర్తి పరిధిలోని జోన్ 8 బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం వేపగుంట జోనల్ కార్యాలయంలో జెడ్సీ కె.హేమావతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.వి.రామరాజు, సభ్యులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆమెకు వివరించారు. శివారు ప్రాంతాల్లో వి.ఎల్.టి. ఇబ్బందులు ఉన్నాయని, వాటి మంజూరులో జాప్యమవుతుందన్నారు. పరిశీలించి చర్యలు చేపట్టడం జరుగుతుందని జెడ్సీ ఈసందర్భంగా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్; సంయుక్త కార్యదర్శి ఎ.సతిష్, ఈసీ మెంబర్లు బి.చిన్నారావు, ఆదిత్య శ్రీకర్ తదితరలు పాల్గొన్నారు.

స్పందనకు 6 ఫిర్యాదులు

వేపగుంట జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 6 ఫిర్యాదులు అందాయి. వీటిలో జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్‌లో అక్రమ నిర్మాణంను ఆపాలని, 91వ వార్డు విద్యానగర్‌లో సెప్టిక్ ట్యాంక్‌తో ఇబ్బందులు కలుగుతున్నాయని, వెంకటాపురంలో కుక్కలను నియం త్రించాలి, చిన ముషిడివాడలోని సర్వెనెంబరు 110లో ఆక్రమణలను తొలగించాలని కోరారు. 98వ వార్డు సాయినగర్ కాలనీలో రోడ్డు సమస్యను పరిష్కరించాలని ఫిర్యాదులు అందాయి. వీటిని సంబంధిత శాఖాధిపతులకు పంపించి చర్యలు చేపట్టనున్నట్లు జెడ్సీ కె.హైమావతి తెలియజేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

పెందుర్తి రూరల్, ఫిబ్రవరి 5: గ్రేటర్ 95వ వార్డు చీమలాపల్లి పరిసర గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత రోళ్ల పైడిమాంబ ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త అయితా ఎర్నిబాబు ఆధ్వర్యంలో వివిధ రకాల పూలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం భజనలు, కోలాటాలు నిర్వహించారు. బాణసంచా కాల్చారు.

సీఎం జగన్మోహన్‌రెడ్డికి శారదాపీఠం ఆహ్వానం

పెందుర్తి, ఫిబ్రవరి 5: సీఎం జగన్మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో సోమవారం శారదాపీఠం ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 15వ తేదీ నుంచి 19 వరకు జరగనున్న శారదాపీఠం వార్షికోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను స్వాత్మానందేంద్ర సీఎం జగన్‌కు అందజేశారు. ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరుకావాలని సీఎంను ఆహ్వానించారు. మహా రుద్రసహిత రాజశ్యామల యాగంలో పాల్గొవాలని కోరారు. అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని సీఎంకు అందజేశారు.



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర

ఆకట్టుకున్న ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ ప్రదర్శన

పెందుర్తి రూరల్, ఫిబ్రవరి 5: గ్రేటర్ 95వ వార్డు రవీంద్ర భారతి పాఠశాలలో సోమవారం విద్యార్థులు నిర్వహించిన ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ ప్రదర్శన ఆకట్టుకొంది. విద్యార్థులు సృజనాత్మకతో పురాతన విధానాలు, నవీన పద్ధతులతో తయారుచేసిన బొమ్మలు, చిత్రాలను ప్రదర్శించారు.పాఠశాల చైర్మన్ ఎం.ఎస్.వుది, జోనల్ ఇన్‌చార్జి ఎన్. వెంకటేశ్, సీజీఎం వసంత, జి.ఎం.రమ్య తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రదర్శనను తిలకించారు.



ప్రదర్శనలో నమూనాలతో విద్యార్థులు

యారాడకు వెళ్లే మార్గంలో దుర్గంధం

సింధియా, ఫిబ్రవరి 5: సింధియా నుంచి యారాడ వెళ్లే రహదారి పక్కన పెద్ద ఎత్తున వ్యర్థాలు డంపింగ్ చేయడంతో వాహనదారులు, పర్యాటకులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. రహదారి ఇరువైపులా సమీపంలో ఉన్న వ్యాపారులు కోడి మాంసం వ్యర్థాలు, కుళ్లిన కూరగాయలు, భవన శిథిలాలను పెద్ద ఎత్తున డంపింగ్ చేయడంతో దీంతో ఆ ప్రాంతంలో దుర్గంధ పూరితవాతావరణం ఆవహిస్తోంది. దీంతో నిత్యం యారాడ బీచ్‌కు వెళ్లే పర్యాటకులతోపాటు స్థానికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. దుర్వాసన భరించలేకపోతున్నామని ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. పర్యాటక ప్రాంతాలకు వెళ్లే దారిలో ఇలా చెత్తాచెదారాలు పేరుకున్నా పట్టించుకోకపోవడం తగదని పలువురు వాపోతున్నారు.



బీచ్‌కు వెళ్లే రహదారిలో గుట్టలుగా చెత్త, వ్యర్థాలు



న్యాయవాదులకు మద్దతుగా దీక్షలో కూర్చున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

గాజువాక, ఫిబ్రవరి 5: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేసేంత వరకు పోరాటాలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ గాజువాక నియోజకవర్గ సీనియర్ నాయకుడు చెల్లుబోయిన నాయుడు పేర్కొన్నారు. ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గాజువాక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని సోమవారం ఆయనతో పాటు పలువురు నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చట్టం వల్ల అన్నివిధాల అందరికీ అన్యాయం జరుగుతుందన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే ఎటువంటి చర్యలు ప్రభుత్వం తీసుకున్నా పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సంప్రదాయ కళలను ప్రోత్సహించాలి

స్టీల్‌ప్లాంట్ జీఎం (మార్కెటింగ్) జీవీఎస్ ప్రసాద్



విస్కా పూర్వ అధ్యక్షుడు కేశవరావును సత్కరిస్తున్న ప్రతినిధులు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 5: మన సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా ప్రాచీన కళలను ప్రోత్సహించాలని స్టీల్‌ప్లాంట్ జీఎం (మార్కెటింగ్) జీవీఎస్ ప్రసాద్ అన్నారు. స్టీల్ కల్చరల్ అసోసియేషన్ (విస్కా) ఆధ్వర్యంలో ఉక్కు క్లబ్‌లో సోమవారం నిర్వహించిన త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. శాస్త్రీయ సంగీతం ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. విస్కా అధ్యక్షుడు నేమాని శ్రీనివాసశర్మ మాట్లాడుతూ విస్కా ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమాలను చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శి ఏవీఎస్ఎన్ శర్మ మాట్లాడుతూ మన సంస్కృతీ సంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శనీయమన్నారు. అనంతరం విస్కా ఏర్పడి 40 ఏళ్లయిన సందర్భంగా సావనీర్‌ను ఆవిష్కరించారు. విస్కా పూర్వ అధ్యక్షుడు ఎ.కేశవరావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు ఎస్ఎన్ రావు, కిశోర్, శ్రీనివాస్, శివప్రసాద్, ఎం.సత్యనారాయణ, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

కనీస పెన్షన్‌గా రూ.9,000 చెల్లించాలి

పెదగంట్యాడ, ఫిబ్రవరి 5: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వారికి కనీస పెన్షన్ కింద రూ.9,000 చెల్లించాలని, అందుకనుగుణంగా డీఏ ఇవ్వాలని పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.దీనబందు డిమాండ్ చేశారు. పెన్షనర్స్ అసోసియేషన్ పెదగంట్యాడ శాఖ సోమవారం స్థానిక సీడబ్ల్యూసీలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైల్వే చార్జీలో 50 శాతం రాయితీ ఇవ్వాలని, కార్పొరేట్ ఆస్పత్రుల్లో పెన్షనర్లకు ఉచిత వైద్య సదుపాయం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు కణితి అప్పలరాజు, నమ్మి అప్పలనాయుడు, కె.పెంటారావు, పి.వెంకటరావు, ఎన్‌వీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

రా.. కదలి రా సభకు తరలిన టీడీపీ శ్రేణులు



రాంపురంనుంచి చం ద్రబాబు సభకు వెళ్తున్న టీడీపీ శ్రేణులు

పెందుర్తి, ఫిబ్రవరి 5: అనకాపల్లి జిల్లా కోటపాడు మండలం గొండుపాలెంలో సోమవారం నిర్వహించిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు రాకదిలి రా బహిరంగసభకు మండలంలోని రాంపురంలో టీడీపీ నేత రెడ్డి నారాయణరావు ఆధ్వర్యంలో భారీ సం ఖ్యలో కార్యకర్తలు తరలివెళ్లారు.

గీతం కళాశాల ఆధ్వర్యంలో వైద్య శిబిరం

గోపాలపట్నం, ఫిబ్రవరి 5: గ్రేటర్ 92వ వార్డు వెంకటాపురంలో ఎన్టీఆర్ సేవా సమితి, ఎంవీవీఎస్ మూర్తి ట్రస్ట్ సంయుక్తంగా గీతం కళాశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని టీడీపీ నేత పెతకంశెట్టి మౌర్య సింహ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీతం కళాశాల ప్రజలకు చేరవగా వైద్య సేవలందించడం అభినందనీయమని కొనియాడారు. పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు బొడ్డేటి విజయ్ కుమార్, ఎన్.సోములు, వైద్య బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఎన్.ఎ.డి. ఫ్లైఓవర్ పార్కులో అంబేడ్కర్ విగ్రహం

ఎన్.ఎ.డీ జంక్షన్ ఫిబ్రవరి 5: ఎన్.ఎ.డీ ఫ్లైఓవర్‌లో మధ్యలో రాజ్యాంగ నిర్మాత బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుపై ఎస్.సీ.ఎస్.టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఇక్కడి కూడలిలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు వీలుగా కౌన్సిల్‌లో తీర్మానం చేసిన విషయం తెలిసిందే. అయితే, ఒక్కసారిగా రాత్రికిరాత్రికి ఇక్కడిపార్కులో విగ్రహం ఏర్పాటుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా విగ్రహం ఏర్పాటుకు ఉడా, జీవీఎంసీ అధికారులు అనుమతి తీసుకోవాలి. ఎన్నికల నేపథ్యంలో ఇంత త్వరగా ఏర్పాటుచేసినట్టు ఆరోపణలువస్తున్నాయి. ఈ విగ్రహాన్ని దళిత సంఘాలనేతలు సోమవారంపరిశీలించారు. దీనిని తొలగిస్తే సహించేదిలేదని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎన్.ఎ.డీ జోన్ ఎస్.సి. ఎస్.టి. వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిదులు జె.వి.ప్రభాకర్‌రావు, ఎస్.రాజు, సి.హెచ్.చిరంజీవి. జి.రాంబాబు, రాజేంద్రప్రసాద్, కె.లక్ష్మణరావు, బి.సూరిబాబు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత నాయకులు

ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ

సింధియా, ఫిబ్రవరి 5: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీలో కార్పొరేటర్ జి. నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది సోమవారం ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ- ఆరోగ్యశ్రీ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, యూపీహెచ్ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గోపాలపట్నం: ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని జీవీ ఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు సూచించారు. 91వ వార్డు పాతగోపాలపట్నం లో లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులను ఆయన సోమవారం అందజేశారు. సచివాలయ సిబ్బంది, వార్డు నేతలు పాల్గొన్నారు.

అప్పన్న తెప్పోత్సవం ఏర్పాట్లు పరిశీలన

సింహాచలం, ఫిబ్రవరి 5 : సింహగిరి కొండ దిగువన ఈనెల 9న జరగాల్సిన అప్పన్న తెప్పోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను ఈఓ శ్రీనివాసమూర్తి సోమవారం పరిశీలించారు. తొలుత ఆయన తన కార్యాలయంలో ఏర్పాట్లపై సిబ్బంది, పాలకమండలి సభ్యులు, ఏసీపీలతో చర్చించారు.అనంతరం వరాహ పుష్కరిణికి వెళ్లి అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ దేవస్థానానికి చెందిన అన్ని విభాగాలను సమన్వయం చేసుకుని ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

స్విమ్మింగ్‌లో నాగ గ్రీష్మిణికి పతకాలు



పతకాలతో గ్రీష్మిణి

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 5: అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన వి.నాగ గ్రీష్మిణి స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించి రికార్డు నెలకొల్పింది. చెన్నైలో జరిగిన ఈ టోర్నీలో 50మీ. బ్రెస్ట్ స్ట్రోక్‌లో స్వర్ణ పతకం సాధించిన గ్రీష్మిణి..100మీ. బ్రెస్ట్ స్ట్రోక్‌లో రజతం, 200మీ. బ్రెస్ట్ స్ట్రోక్ కాంస్యం సాధించింది. ఈ సందర్భంగా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి మోహన్ వెంకటరామ్, ఇతర ప్రతినిధులు, సీనియర్ స్విమ్మర్లు, కోచ్‌లు నాగ గ్రీష్మిణిని అభినందించారు.

తహసీల్దార్ హత్య కేసు దోషులపై కఠిన చర్యలు: కలెక్టర్



సంతాపం వ్యక్తంచేస్తున్న కలెక్టర్, అధికారులు

మహరాణిపేట, ఫిబ్రవరి 5: విశాఖ రూరల్ మండల తహసీల్దారుగా విధు లు నిర్వహించి, బదిలీపై రిలీవ్ అయిన సనపల రమణయ్య మృతి పట్ల కలె క్టర్ ఎ.మల్లికార్జున తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, తహసీల్దార్ రమణయ్య హత్యకు గురవడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణి స్తోందని, త్వరలోనే దోషులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రమణయ్య ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ జిల్లా అధికారులు, సిబ్బంది రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూరి అశోక్, డీఆర్‌వో కె. మోహన్ కుమార్‌తోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోరాపుట్‌లో డీఆర్ఎం తనిఖీలు



యాక్సిడెంట్ రిలీఫ్ రైలు తనిఖీచేస్తున్న డీఆర్ఎం

విశాఖపట్నం, ఫిబ్రవరి 5: భద్రతా ఆడిట్‌లో భాగంగా డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్ సోమవారం కోరాపుట్ రైల్వే స్టేషన్‌లో పర్యటించారు. ముందుగా యాక్సిడెంట్ రిలీఫ్ రైలు, మెడికల్ ఎమర్జన్సీ రిలీఫ్ రైలు, ఇంజనీరింగ్ రిలీఫ్ రైళ్ల నిర్వహణపై తనిఖీలు చేపట్టారు. అనంతరం స్టేషన్‌లో పర్యటించి ప్రయాణికుల మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి అంశాలపై అధికారులతో సమీక్షించారు. వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సత్వరమే ధ్రువ పత్రాలు మంజూరు

సీతమ్మధార, ఫిబ్రవరి 5:సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ శ్రీరామమూర్తి అర్జీలు స్వీకరించారు.అక్కడికక్కడే పరిశీలించి అవసరమైన వారికి తక్షణమే సర్టిఫికెట్లు జారీ చేసేలా చర్యలు తీసుకున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, జనవరి 5: తాటిచెట్లపాలెం ఫీడర్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2-30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ సింహాచలం నాయుడు తెలిపారు. రైల్వేన్యూకాలనీ బజారు ఏరియా, మసీదు, రామాలయం ఏరియా, తాటిచెట్లపాలెం ప్రధాన రహదారి తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీతమ్మధార: నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు జోన్ 1 ఈఈ సింహాచలం నాయుడు తెలిపారు. కేఆర్ఎం కాలనీ, బాలయేసు చర్చి ప్రాంతం, ఆక్సిజన్ టవర్స్ వెనుక ప్రాంతం, నక్కవానిపాలెం, నక్కవానిపాలెం 60 ఫీట్ రోడ్డు ప్రాంతాల వినియోగదారులు గమనించాలని కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

సీతంపేట, ఫిబ్రవరి 5: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ద్వారకా స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాలివి.. సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్స్ లేఅవుట్‌లో ప్రశాంతి నిలయం అపార్టుమెంట్ సెల్లారులో అలూర్తి రా మరాజు (55) ఆఫీస్ తీసుకొని ఉంటున్నారు. ఆయన బిల్డర్‌గా కన్‌స్ట్రక్షన్ ఫీల్డులో పనిచేస్తున్నారు. అయితే, వ్యాపార పరంగా ఆర్థికపరమైన ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో మనస్తాపంతో అపార్టుమెంట్ తన కార్యాలయ గదిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ సభ్యుల సమాచారంమేరకు ఎస్ఐ ధర్మేంద్ర కేసు నమోదు చేశారు.

రహదారిపై వ్యాపారాలు.. రాకపోకలకు అవస్థలు

» గ్రేటర్ 27వ వార్డులో దుస్థితి

దొండపర్తి, ఫిబ్రవరి 5 : గ్రేటర్ 27వ వార్డులోని పలు ప్రాంతాల్లో రోడ్లపైనే తోపుడు బండ్లు, బడ్డీలు ఏర్పాటుచేసి వివిధ రకాల వ్యాపారాలు సాగించడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొంతమంది నెలవారీ మామూలు వసూలు చేసి బడ్డీలను ఏర్పాటుకు సహకరిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. శ్రీనగర్, బుధిల్‌పార్కు, హోటల్, శ్రీ కృష్ణ విద్యా మందిర్, పౌరగ్రంథాలయం కూడలి ప్రాంతాల్లో రహదారులు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి బడ్డీలను ఏర్పాటు చేస్తున్నారు. వీటి ద్వారా భోజనాలు, టిఫిన్లు రోడ్లపైనే విక్రయిస్తున్నారు. కొనుగోలుదారుల వాహనదారులు రోడ్లపైనే పార్కింగ్ చేయడంతో రద్దీ నెలకొంటోంది. వాహనదారులు, పాదచారులు ప్రయాణించాలంటేకష్టమవుతోందని వాపోతున్నారు. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలు, కాలువల్లో వ్యర్థాలువేయడం వల్ల అవి నిండిపోవడంతో రహదారిపై మురుగునీరు ప్రవహిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన బడ్డీలను తొలగించాలని కోరుతూ వార్డు టీడీపీ అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి సోమవారం జీవీఎంసీలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఇకనైనా జీవీఎంసీ అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.



శ్రీనగర్ ప్రాంత రహదారి పక్కన ఆక్రమణలు

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు అందిస్తున్న ఎన్.వి.బి.పి.రావు దంపతులు

మురళీనగర్, ఫిబ్రవరి 5; మురళీనగర్ 49వ వార్డు పరిధిలోని వానప్రస్థ వృద్ధాశ్రమంలో సోమవారం దాతలు దుప్పట్లను వితరణగా అందించారు. నగరంలోని శ్రీ చంద్రమౌళీశ్వర చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు తమ సేవల్లో భాగంగా వీటిని అందించారు. ట్రస్ట్ ప్రతినిధులు ఎన్.వి.బి.పి. రావు దంపతులు, ఆడిటర్ మధు ట్రస్ట్ నిర్వాహకులు శ్రీనివాస్ నేతృత్వంలో ఈ వితరణ కార్యక్రమం చేపట్టారు. కుటుంబాలకు దూరంగా జీవిస్తున్న వారికి చేయూతనందించాలనే ఉద్దేశంతో ఈ పంపిణీ చేపట్టినట్లు దాతలు పేర్కొన్నారు.

భాషల్లో సాంకేతిక పదజాలంపై జాతీయ సదస్సు



సెయింట్ జోసెఫ్ కళాశాలలో సదస్సులు ప్రారంభిస్తున్న అతిథులు

జ్ఞానాపురం, ఫిబ్రవరి 5: స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో కేంద్ర ప్రభుత్వ విద్యామంత్రిత్వ శాఖ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టెర్మినాలజీ కమిషన్ న్యూఢిల్లీ సౌజన్యంతో భారతీయ భాషల్లో విద్య, సాంకేతిక పదజాలం ప్రాధాన్యంపై రెండు జాతీయ సదస్సులను సోమవారం ప్రిన్సిపాల్ డా.సిస్టర్‌షైజీ ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా ఏయూ సివిల్ ఇంజనీరింగ్ విభాధిపతి ఆచార్య సీఎన్‌వీ సత్యనారాయణ రెడ్డి సదస్సు ప్రాముఖ్యతను వివరించారు.హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్య ఎస్ అరుల్ మౌళీ సాంకేతిక పదజాల అనువాద రీతులు, ద్రవిడియన్ యూనివర్సిటీ ఆచార్య ఎం.సికేశవమూర్తి భారతీయభాషల ఏకత్వంపై వివరించారు. రాజమండ్రి ప్రభుత్వ కళాశాల రాజనీతి విభాగ ఆచార్య కె.సీతామహాలక్ష్మి, నన్నయ్య యూనివర్సిటీ ఆచార్య టి.సత్యనారాయణ నూతన విద్యావిధానం,అంతరించిపోతున్న తెలుగు పదజాలం అంశంపై ప్రసంగించారు. కార్యక్రమంలో డాక్టర్ పికే జయలక్ష్మి, సిస్టర్ మేరీ, డాక్టర్ నిర్మల, జైన్‌థామస్ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి ఐద్వా కార్యవర్గ సమావేశాలు

కోశాధికారి పుణ్యవతి

విశాఖపట్నం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఐద్వా జాతీయ కార్యవర్గ సమావేశాలను ఈనెల 22 నుంచి 25 వరకూ విశాఖలో నిర్వహించనున్నట్టు అఖిలభారత కోశాధికారి ఎస్.పుణ్యవతి తెలిపారు. సీఐటీయూ కార్యాలయం లో సోమవారం ఆమె మాట్లాడారు. మహిళా సంఘాల సమస్యలపై నిరంతర పోరాటాలు జరిగే విశాఖలో ఈ సమావేశాలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. మహిళల హక్కుల పరిరక్షణ, స్వేచ్ఛ కోసం చేయాల్సిన పోరాటం, కర్తవ్యాలపై ఈసమావేశాల్లో కార్యాచరణ రూపొందిస్తామన్నారు. న్నివర్గాల ప్రజలు, విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు, మేధావులు, మహిళా అభ్యుదయవాదులు హాజరై విజయవంతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. సమావేశాలు ప్రారంభం రోజైన 22న భారీ ప్రదర్శన, బహిరంగసభ జరుగుతుందన్నారు. ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వైసత్యవతి పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ జీఎంను దూషించిన మేనేజర్ సస్పెన్షన్

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 5: స్టీల్‌ప్లాంట్ ఎల్అండ్‌డీసీ విభాగాధిపతి ఎన్. భానును ఫోన్‌లో దుర్భాషలాడడంతో పాటు కులం పేరుతో దూషించిన అదే విభాగానికి చెందిన మేనేజర్ అనంత్ పర్వార్‌ను ఉక్కు యాజమాన్యం సోమవారం సస్పెండ్ చేసింది. తనను కులం పేరుతో మేనేజర్ పర్వార్ దూషించాడంటూ స్టీల్‌ప్లాంట్ పోలీసులకు జీఎం భాను ఈ నెల 2న ఫిర్యాదు చేయడంతో వారు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేశారు. ఈ ఫిర్యాదుపైస్పందించిన నగర కమిషనర్‌సౌత్ ఏసీపీ టి.త్రినాథ్‌ను విచారణా.దికారిగా నియమించారు. కాగా పర్వార్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఉక్కు యాజమాన్యానికి జీఎం ఫిర్యాదు చేయడం, దీనిపై తక్షణ చర్యలు చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు బయ్యే మల్లయ్య, తదితరులు ఒత్తిడి తేవడంతో యాజ మాన్యం ఆయనను సస్పెండ్ చేసింది.

ఉద్యోగం ఇస్తానని చెప్పి టోకరా

కంచరపాలెం, ఫిబ్రవరి 5 : న్యూజిలాండ్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని యువకుడినుంచి రూ.8 లక్షలు తీసుకుని మోసగించిన ఘటన చోటుచేసుకుంది.కంచరపాలెం కప్పరాడ ప్రాంతంలో ఉంటున్న లగుడు రవీంద్ర ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నారు. రవీంద్రకు తన స్నేహితుని ద్వారా హైదరాబాద్‌లో ఉంటున్న వలమాడ మోహన్‌కుమార్ పరిచయమయ్యాడు. ఈ క్రమంలో మోహన్‌కుమార్ న్యూజిలాండ్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని రవీంద్ర వద్ద రూ.8లక్షలు తీసుకున్నాడు.నకిలీ వీసాను సృష్టించి రవీంద్రకు ఇచ్చారు. చివరికి తాను మోసపోయిన ట్టు రవీంద్ర గుర్తించారు. దీంతో ఆయన కంచరపాలెం పోలీసులను ఆశ్రయించాడు. ఎస్ఐ దివ్యభారతి దర్యాప్తు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు.

పాత పింఛన్‌పై హామీ ఇచ్చే పార్టీకే మద్దతు: యూటీఎఫ్



పోస్టర్లు ప్రదర్శిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

మర్రిపాలెం, ఫిబ్ర వరి 5: పాత పింఛన్ పునరు ద్ధరణపై హామీ ఇచ్చే పార్టీకే ఉద్యోగ, ఉపాధ్యాయుల మద్దతు ఉంటుందని యూటీఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టి. ఆర్. అంబేడ్కర్ అన్నారు. సోమ వారం యూనియన్ జిల్లా కార్యాలయంలో ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్లను ఆవి ష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగిగా జీవితకాలం సే వలందించి, పదవీ విరమణ తర్వాత భద్రత కోసం పోరాడి సాధించుకున్న పెన్షన్ ఓపీఎస్‌ను రద్దు చేసి సీపీఎస్, జీపీఎస్ అంటూ చలగాటం ఆడుతున్నారని విమర్శించారు. ఈ స్థితిలో రానున్న ఎన్నికల్లో ఏపార్టీ అయితే పాత పిం ఛన్ పునరుద్ధరిస్తామని హామీ ఇస్తారో వారికే ఓటు వేసేలా ప్రజల్లో ప్రచారం తీసుకువెళ్తామన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాడానా అ ప్పారావు, జిల్లా గౌరవ అధ్యక్షులు అనకాపల్లి పైడిరాజు, ఉపాధ్యక్షులు రొంగలి ఉమా, కోశాధికారి కె.రాంబాబు, జిల్లా కార్యదర్శులు చుక్కా సత్యం, రియాజ్ అహ్మద్, ఎం.రాంబాబు, బి.జనార్దన్, ఎన్.సూరిబాబు, పెందుర్తి, గాజువాక మం డలాల అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ విధానాలతోనే మణిపూర్‌లో అంతర్యుద్ధం'



పుస్తకావిష్కరణలో వక్తలు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 5: దేశంలో నెలకొన్న రాజకీయ వాతావరణం, బీజేపీ అనుసరిస్తున్న నిరంకుశ విధానాల వల్లే మణిపూర్‌లో తెగల మధ్య అంతర్యుద్ధానికి కారణమని వక్తలు అభిప్రాయం వ్యక్తంచేశారు. సోమవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో 'అంతర్యుద్ధంలో మణిపూర్ పుస్తకావిష్కరణ' సభ నిర్వహించారు. ముందుగా డా. జోస్ మాలేకల్ పుస్తకావిష్కరించి తొలి ప్రతిని డా.కృష్ణమూర్తికి అందించారు. అనంతరం సభకు అధ్యక్షత వహించిన మహిళా చేతన ప్రధాన కార్యదర్శి కత్తి పద్మ మాట్లాడుతూ- మణిపూర్‌లో ఇటీవల పర్యటించామన్నారు. అక్కడి పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయని వివరించారు. నిర్బంధం మధ్య అక్కడి ప్రజలు జీవిస్తున్నారన్నారు. అక్కడి అంశాలపై రచించిందే ఈ అంతర్యుద్ధం మణిపూర్ అని వివరించారు. డా.జోస్ మాలేకల్ పుస్తకాన్ని పరిచయం చేశారు. న్యాయవాది జహా ఆరా తమ పర్యటన అనుభవాలు తెలిపారు.పుస్తకాన్ని ప్రొఫెసర్‌సత్యపాల్ సమీక్షించారు.

ఆకట్టుకున్న వైమానిక ప్రదర్శన



ప్రదర్శనలో 30వ సీ కెడిట్ క్రాఫ్స్

గోపాలపట్నం, ఫిబ్రవరి 5: ఐఎన్ఎస్ డేగాలో సోమవారం నిర్వహించిన వైమానిక ప్రదర్శన అబ్బురపరచిం ది. చేతక్ ఎయిర్ క్రాఫ్ట్, వైమానిక ప్రదర్శనలతోపాటు అగ్నిమాపకానికి సంబంధించి ప్రదర్శనల్లో 30వ సీ కెడిట్ క్రాఫ్స్ పాల్గొన్నారు. భద్రతా దళ సిబ్బంది తమ సాహసోపేత ప్రదర్శనలతో ఎంతగానో ఆకట్టుకున్నారు.

'మంత్రి అమర్ రూ.కోట్లు సంపాదించారు.. అందుకే టికెట్ నిరాకరణ'

సీతంపేట, ఫిబ్రవరి 5: రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్ ..ముఖ్యమంత్రి జగన్ పేరు చెప్పి ఆయనకు తెలియకుండా రూ.500 కోట్లు సంపాదించడంవల్లే రానున్న ఎన్నికల్లో పోటీ చేయడానికి వీలుగా ఎమ్మెల్యే టికెట్ కేటాయించడం లేదని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రులలో వయసులో చిన్న అయిన అమర్‌కు ఎంతో ప్రేమతో ముఖ్యమంత్రి కీలకమైన శాఖలు అప్పగిస్తే.. మం త్రులు, చివరకు ముఖ్యమంత్రి షాక్ అయ్యే విధంగా వందల కోట్లు సంపాదించారన్నారు. ఇప్పుడు ఎమ్మెల్యే, ఇటు ఎంపీ టికెట్ లేకుండా పోతోందన్నారు. అందుకే తన తలరాత జగన్ రాస్తారంటూ మెట్ట వేదాంతం వల్లిస్తున్నారని ఎద్దేవా చేశారు. గంగవరం పోర్టును జగన్ అమ్మేస్తే.. అందులోని రూ.200 కోట్ల స్క్రాప్‌ను అమర్ వి క్రయించారని ఆరోపించారు.ఈ సమావేశంలో ఉత్తరాంధ్ర సమన్వయకర్తలు నాగలక్ష్మి చౌదరి, త్రివేణి రవి పాల్గొన్నారు.

సృజనాత్మకత కోసమే ఎగ్జిబిషన్



ప్రదర్శనలో చిన్నారులు

మురళీనగర్, ఫిబ్రవరి 5 ; ఎన్‌జీజీఓస్ కాలనీలోని మురళీనగర్ రవీంద్రభారతి పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ అలరించింది. బాలల్లో సృజనాత్మకత వెలికితీతకు ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు ప్రిన్సిపల్ బి.గాయత్రిదేవి పేర్కొన్నారు. బొమ్మలు, కళాఖండాలు ప్రదర్శించారు. రవీంద్రభారతి పాఠశాలల చైర్మన్ ఎం.ఎస్.మణి, జోనల్ ఇన్‌చార్జి వెంకటేష్ ఉన్నారు.

నిలిచిన రిజిస్ట్రేషన్లు

... 3వ పేజీ తరువాయి

రిజిస్ట్రేషన్లకు ఏర్పాటుచేశారు. సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చి, వారి సంతకాలు చెల్లుబాటు అయ్యేలా చట్టం ప్రకారం వారికి కూడా రిజిస్ట్రేషన్ అధికారం కల్పించారు. వచ్చే నెలలో ఎన్నికల ప్రకటన రానున్న నేపథ్యంలో ఈలోగానే ఈ సెంటు భూముల రిజిస్ట్రేషన్ పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేవలం నెల రోజుల్లో 26 లక్షల రిజిస్ట్రేషన్లు చేయాలి. ఇటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, అటు గ్రామ సచివాలయాలు ఒకేసారి సర్వర్ వినియోగించడం వల్ల ఒత్తిడి పెరిగి అది స్తంభించిపోతోంది. ఇటీవల వారంలో ఒకటి, రెండు రోజులు ఇలాగే జరుగుతుంది. సోమవారం మాత్రం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సర్వర్ పూర్తిగా డౌన్ అయిపోయింది. అదే సమయంలో సచివాలయాల సర్వర్ ఊపందుకుని బాగానే పనిచేసింది. అంటే సెంటు భూముల రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సర్వర్‌ను డౌన్ చేశారని ఆ శాఖ వర్గాలు అనుమానిస్తున్నాయి. తమకు మాత్రం ఈ-సంతకం వద్ద డాక్యుమెంట్ ఆగిపోయి, సచివాలయాల్లో ఆ సమస్య తలెత్తకుండా ప్రాసెస్ పూర్తి అవుతున్నదంటే దాని అర్థం ఆ సర్వర్‌కు లైన్ క్లియర్ చేసి, డిపార్టుమెంట్ వ్యవహారాలకు కావాలనే కాసింత విరామం ఇచ్చినట్టుగా ఉందని భావిస్తున్నారు. వారంలో ఒకటి, రెండు రోజులు ఇలాగైతే ఫరవాలేదని, కానీ రోజూ ఇదే సమస్య ఏర్పడితే రిజిస్ట్రేషన్లకు వచ్చే వారి నుంచి ఇబ్బందులు తప్పవని అధికార వర్గాలు చెబుతున్నాయి. సచివాలయాల్లో డాక్యుమెంట్ల అప్‌లోడింగ్ వంటివి ఏమీ లేకుండా లబ్ధిదారుడి ఈకేవైసీ, సిబ్బంది ఈ-సంతకం చేస్తే సరిపోతుంది. దాంతో అక్కడ సోమవారం ఏ ఇబ్బంది లేకుండా సెంటు భూముల రిజిస్ట్రేషన్లు జరిగాయి. రాష్ట్రంలో సెంటు భూముల రిజిస్ట్రేషన్లు సుమారు 16 వేలు మాత్రమే జరిగాయి. ఇంకా 25.5 లక్షల వరకు చేయాల్సి ఉంది. దానికి ఈ నెల 15వ తేదీ గడువు పెట్టారు. ఆ లక్ష్యం కోసం అమరావతి అధికారులు ఇంకేమి చేస్తారోనని ఆ శాఖలో చర్చ జరుగుతోంది.

హడలిపోతున్న అధికారులు

... 3వ పేజీ తరువాయి

రూ.100 కోట్ల విలువ చేసే భూమి రూ.18 కోట్లకే వస్తున్నదని దళారి చెప్పడంతో ఎమ్మెల్యే అడ్వాన్స్ ఇచ్చేశారు. ఆ భూమి యజయాని అమెరికాలో ఉండగా వారికి తెలియకుండా ఎమ్మెల్యే కుమారుడి పేరిట రిజిస్టర్ చేయడానికి యత్నించారు. అక్కడ ఎకరా భూమి ప్రభుత్వ ధర ఆనాడు రూ.2.2 కోట్లు ఉండగా దానిని రూ.1.53 కోట్లు చొప్పున రిజిస్టర్ చేయాలని, ఆ మొత్తానికే ఫీజులు కట్టించుకోవాలని సబ్ రిజిస్ట్రార్‌పై ఒత్తిడి పెట్టారు. అలాగే ఆ భూమి పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయం సిబ్బందిని బెదిరించారు. ఈ కేసులో ఎమ్మెల్యే కూడా మోసపోయారు. అయితే తనకు అనుకూలంగా చేయాల్సిందిగా అధికారులను బెదిరించారు.

నేను వచ్చానంటే అర్థం చేసుకోవాలి

నగరంలో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇప్పుడు నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా ఉన్నారు. భీమిలి, భోగాపురం, ఆనందపురం ఇలా చాటాచోట్ల ఆయన వెంచర్లు ఉన్నాయి. వీటికి సంబంధించిన రిజిస్ట్రేషన్ విషయంలో ఓ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. అది ప్రభుత్వ భూమి అని, సర్వే నంబరు సబ్ డివిజన్ జరిగిందని, ఆ వివరాలు తీసుకువస్తే రిజిస్ట్రేషన్ చేస్తామని సదరు అధికారి వివరించారు. దానికి ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. 'నేను వచ్చానంటే అర్థం చేసుకోవాలి. పని చేసి పెట్టాలి' అంటూ రంకెలు వేశారు. అక్కడితో ఆగకుండా డబ్బులు ఇస్తే చేసేస్తావా?నీ సంగతి తేలుస్తా!!' అంటూ హెచ్చరించారు.

చెట్టుకు వేలాడ దీస్తా

పక్క జిల్లాలో సీనియర్ మంత్రి ఉన్నా అధికారులంతా అధికార పార్టీకి చెందిన ఆ నాయకుడు చెప్పినట్టు వినాల్సిందే. ఆ జిల్లాకు, విశాఖ జిల్లాకు సరిహద్దుల్లోని భూముల లావాదేవీల విషయంలో ఓ సబ్ రిజిస్ట్రార్ నిబంధనల ప్రకారం చేయలేమని చెప్పడంతో తీవ్రస్థాయిలో బెదిరించారు. 'పిచ్చి వేషాలు వేస్తే...చెట్టుకు వేలాడదీస్తా' అంటూ హెచ్చరించారు. భీమిలి, గాజువాక, ఆనందపురం మండలాలతో పాటు అక్కడి సబ్ రిజిస్ట్రార్లకు కూడా ఇలాంటి బెదిరింపులు చాలానే వచ్చాయి. కొందరు అక్కడి నుంచి బదిలీ చేయించుకొని వెళ్లిపోతే, మరికొందరు ఆ కార్యాలయాలకు వెళ్లడానికి నిరాకరించి వేరే ప్రాంతాల్లో పోస్టింగులు వేయించుకున్నారు. ఏదేమైనా విశాఖపట్నంలో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో రాజకీయ నాయకులు ఎక్కువ సంఖ్యలో ఉండడం, ప్రభుత్వ భూములను ఆక్రమించడం వల్ల బెదిరింపులు అధికం అయ్యాయనేది కాదనలేని వాస్తవం.

భారత్ హ్యాట్రిక్

... 3వ పేజీ తరువాయి

హార్ట్‌లీ (36) కలిసి ఎనిమిదో వికెట్‌కు 50 పరుగులు జోడించి భారత్ బౌలర్లకు సహన పరీక్ష పెట్టారు. బెన్ ఫోక్స్‌ను బుమ్రా అవుట్ చేయగా, ఫోక్స్ స్థానంలో వచ్చిన షోయబ్ బషీర్ (0) కొద్దిసేపటికే ముకేష్‌కుమార్ బౌలింగ్‌లో కీపర్ భరత్‌కు క్యాచ్ పట్టడంతో అవుటయ్యాడు. చివరిగా టామ్ హార్ట్‌లీని బుమ్రా క్లీన్ బౌల్డ్ చేయడంతో ఇంగ్లంగ్ రెండో ఇన్నింగ్స్ 292 పరుగుల వద్ద ముగిసి ఓటమి చెందింది.

ఇంగ్లండ్ బ్యాటింగ్‌ను చుట్టేసిన బుమ్రా, అశ్విన్

ఫాస్ట్ బౌలర్ బుమ్రా, స్పిన్ మాంత్రికుడు అశ్విన్‌లు టీ విరామ సమయానికి ముందే ఇంగ్లండ్ బ్యాటింగ్‌ను చుట్టేశారు. తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు తీసిన బుమ్రా..రెండో ఇన్నింగ్స్‌లో కూడా పదునైన బంతులతో మూడు వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ తీయలేకపోయినా అశ్విన్..రెండో ఇన్నింగ్స్‌లో మూడు కీలక వికెట్లు పడగొట్టి టెస్టు కెరీర్‌లో 499 వికెట్ల మైలురాయిని చేరుకున్నాడు.

కరతాళ ధ్వనులతో ప్రేక్షకులు

హైదరాబాద్‌లో జరిగిన తొలి టెస్టులో ఓటమి చెందిన భారత్..ఇక్కడ జరిగిన రెండో టెస్టులో ఒకరోజు మిగిలి ఉండగానే అద్భుతమైన గెలుపుతో ప్రతీకారం తీర్చుకుని సిరీస్‌ను సమం చేసింది. చివరి వికెట్‌గా టామ్ హార్ట్‌లీని బుమ్రా క్లీన్ బౌల్డ్ చేసిన వెంటనే స్టేడియం హోరెత్తింది. ప్రేక్షకులు స్టాండ్స్‌లో నిలబడి భారత్ ఆటగాళ్లు డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లేంత వరకూ చప్పట్లతో అభినందనలు తెలిపారు.

ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా బుమ్రా

రెండు ఇన్నింగ్స్‌లో తొమ్మిది వికెట్లు పడగొట్టి భారత్ జట్టు విజయంలో కీలకపాత్ర వహించిన బుమ్రా ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ (209) చేసిన యశస్వి జైస్వాల్, రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ (104) చేసిన శుభమన్ గిల్ ఉత్తమ బ్యాట్స్‌మెన్ అవార్డు అందుకున్నారు.

అంతా గోప్యం

... 3వ పేజీ తరువాయి

నిర్మించిన అపార్టుమెంట్‌కు సంబంధించిన భూమికి కన్వేయన్స్ డీడ్ కోసం గంగారాం ప్రయత్నించాడా? లేకపోతే వేరొక భూమికి సంబంధించిన డీడ్ కోసం యత్నించాడా?..అనే వివరాలు విలేకరులు అడిగినా సీపీ సమాధానం చెప్పకుండా దాటవేశారు. విచారణలో వెల్లడించిన వివరాలను రెవెన్యూ అధికారులు, ఇతర విభాగాల సీనియర్ అధికారులతో చర్చించి నిర్ధారించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నిందితుడు దొరక్కముందు చెప్పిన విషయాలనే రెండు రోజుల తర్వాత సీపీ చెప్పడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

ఇదిలావుండగా నిందితుడు గంగారాం మొదట్లో ప్రస్తుతం పనిచేస్తున్న నిర్మాణ సంస్థకు బీచ్‌రోడ్డులో గల హోటల్ వ్యవహారాలు చేసేవాడని, ఆ సమయంలో హోటల్ యజమాని తానేనంటూ పలువురి వద్ద నుంచి డబ్బులు వసూలుచేసి మోసం చేసినట్టు తెలిసింది. తర్వాత డబ్బులు ఇచ్చినవారంతా ఒత్తిళ్లు చేయడంతో హోటల్ వదిలేసి పారిపోతే, యాజమాన్యమే తిరిగి అతడిని నగరానికి తీసుకొచ్చిందని, తమ నిర్మాణ రంగ సంస్థలో మేనేజర్‌గా ఉద్యోగం ఇచ్చిందని సమాచారం. ఆ సంస్థ తరఫున రెవెన్యూ, పోలీస్ శాఖలతో అవసరమైన పనులు గంగారాం చక్కబెడుతుంటాడని తెలిసింది. ఏదిఏమైనా పోలీసులు ఈ కేసులో గోప్యత పాటించడం, ఆ శాఖలోని కొద్దిమందికి తప్ప ఎవరికీ తెలియని ప్రాంతంలో రహస్యంగా విచారణ జరపడం, నిందితుడు వెల్లడించిన అంశాలను కూడా బయటకు చెప్పకపోవడంపై పలు రకాల ప్రచారాలు జరుగుతున్నాయి.

ఆరోగ్యం బాగాలేదు...అప్రాధాన్య పోస్టు ఇవ్వండి

... 3వ పేజీ తరువాయి

అయిన సనపల రమణయ్య ఈనెల రెండో తేదీ రాత్రి కొమ్మాదిలో హత్యకు గురైన విషయం తెలిసిందే. రూరల్ మండలంలో అనేక భూములు వివాదాల్లో ఉన్నాయి. నిత్యం కోర్టు కేసులకు హాజరుకావాల్సి ఉంది. ఇంకా రాష్ట్ర స్థాయిలో అనేకమంది రాజకీయ ప్రముఖులకు ఈ మండలంలో భూములు ఉండడంతో అనవసరంగా ఇబ్బందులు పడాల్సి వస్తోందనే శ్రీనివాస మిశ్రా రూరల్ తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించడానికి వెనుకంజ వేసి ఉంటారని రెవెన్యూ వర్గాల్లో ప్రచారం సాగుతుంది.

విశాఖను వైసీపీ నేతలు దోచుకున్నారు

... 3వ పేజీ తరువాయి

మరింత ఉత్సాహపరిచారు. కాగా 'రా..కదలిరా' సభకు టీడీపీ నాయకులు ఊహించని దానికన్నా ఎక్కువ మంది హాజరయ్యారు. దీంతో సభా ప్రాంగణం మొత్తం నిండిపోగా, ఇంకా చాలామంది రోడ్లపైనే వుండాల్సి వచ్చింది. దీంతో వెంకన్నపాలెం-కె.కోటపాటు రోడ్డులో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. సభాస్థలి నుంచి చౌడువాడ వరకు వాహనాలు బారులు తీరాయి.

చంద్రబాబుకు నీరాజనం

... 3వ పేజీ తరువాయి

చంద్రబాబుకు స్వాగతం పలికారు. అనంతరం 11:55 గంటలకు చంద్రబాబు వేదికపైకి వచ్చారు. దీంతో సభా ప్రాంగణం మొత్తం జై బాబు, జైజై బాబు అంటూ నినాదాలతో హోరెత్తింది. వేదికపై ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహానికి చంద్రబాబు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సుమారు గంటన్నరపాటు ఏకధాటిగా ప్రసంగించారు. గత ఎన్నికల్లో జగన్ మాయమాటలు నమ్మి ప్రజలు అధికారం ఇచ్చి మోసపోయారని, మళ్లీ ఇప్పుడు సిద్ధం అంటూ వస్తున్నాడని, ఇంకోసారి అవకాశం ఇస్తే రాష్ట్రం సర్వనాశనం అవుతుందని చంద్రబాబు అన్నారు. వైసీపీ అరాచక పాలనను అంతమొందించి జగన్‌ను ఇంటికి పంపడానికి యువత, మహిళలు, రైతులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలో తెలుగు వారిని నంబర్ వన్‌గా ఉంచాలన్నదే తన లక్ష్యమని, రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్క కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. సభకు ఇంత పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చి ఎన్నికల యుద్ధానికి తాము సిద్ధమని సంకేతాలు పంపితే తాడేపల్లి పిల్లికి జ్వరం వస్తుందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం, వైసీపీ అరాచక పాలనను అంతం చేయడానికి ప్రతిఒక్కరూ ఒక స్టార్ క్యాంపెయినర్‌గా మారాలని పిలుపునిచ్చారు. పేదల భూములు కొట్టేయడానికి వైసీపీ కొత్తగా తెచ్చిన భూ చట్టాన్ని టీడీపీ అధికారంలోకి వచ్చాక రద్దు చేస్తానన్నారు.

చంద్రబాబుకు ఘన స్వాగతం....

అంతకుముందు ఉదయం 11.45 గంటలకు హెలీకాప్టర్‌లో గొండుపాలెం చేరుకున్న చంద్రబాబునాయుడుకి టీడీపీ, జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు. చంద్రబాబు హెలీప్యాడ్‌లో దిగగానే కార్యకర్తలు, నాయకులు భారీసంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు చింతకాయల అయ్యన్నపాత్రుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, తెలుగుమహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, టీడీపీ నాయకులు దాడి వీరభద్రరావు, పప్పల చలపతిరావు, పీవీజీ కుమార్, బత్తుల తాతయ్యబాబు, ప్రగడ నాగేశ్వరరావు, పీలా గోవింద సత్యనారాయణ, గవిరెడ్డి రామానాయుడు, కేఎస్ఎన్ఎస్ రాజు, బైరా ఫౌండేషన్ చైర్మన్ బైరా దిలీప్‌చక్రవర్తి, దాడి రత్నాకర్, లాలం కాశినాయుడు, రొంగలి మహేశ్, దాడి ఎరుకునాయుడు, జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు, ఆ పార్టీ నాయకులు సుందరపు విజయ్‌కుమార్, రాయపురెడ్డి కృష్ణ, బి.శివదత్, పీవీఎస్ఎన్ రాజు, సూర్యచంద్ర, తదితరులు చంద్రబాబుకు స్వాగతం పలికారు.

దళిత ద్రోహి జగన్

» మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్

డాబాగార్డెన్స్ (విశాఖపట్నం), ఫిబ్రవరి 5: రాష్ట్రంలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను మళ్లించి, సంక్షేమ పథకాల్లో కోత విధిస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దళిత ద్రోహిగా మారారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ విమర్శించారు. ఈ నెల 11వ తేదీన రాజమహేంద్రవరంలో నిర్వహించనున్న 'దళిత సింహ గర్జన' సభకు సంబంధించిన పోస్టర్లను సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హర్షకుమార్ మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో దళితులకు సంబంధించి 27 సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం తొలగించిందన్నారు. దళితుల సబ్‌ప్లాన్ నిధులు అమ్మఒడికి కేటాయిస్తున్నారన్నారు. దళితులు జగన్‌ను 420గా భావిస్తున్నారన్నారు. దళిత నాయకులు పి.పెంటారావు, సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.



'దళిత సింహగర్జన' పోస్టర్ ఆవిష్కరిస్తున్న హర్షకుమార్, నాయకులు

ఒక్కడే వీరుడు అల్లూరి సీతారామరాజు చిత్రానికి బయోపిక్ అవార్డు

భీమునిపట్నం (రూరల్), ఫిబ్రవరి 5 : భీమిలి పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించిన ఒక్కడే వీరుడు అల్లూరి సీతారామరాజు చిత్రానికి బయోపిక్ అవార్డు లభించింది. ఈమేరకు తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో చిత్ర నిర్మాత రాజాసాగి సత్యనారాయణ రాజు అవార్డు అందుకున్నారు. ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఈ అవార్డును అందజేసింది.

అధికారుల దృష్టికి రెండో వార్డు సమస్యలు

తగరపువలస, ఫిబ్రవరి 5 : జీవీఎంసీ రెండో వార్డులో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని వైసీపీ బీసీ సెల్ నాయకులు తెలిపారు. సోమవారం వారు తగరపువలసలోని గ్రంథాలయం వీధిలో రోడ్లు, కాలువలను పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు వెంకట్రావు, శ్రీరామ్మూర్తి, బాష, రమణ పాల్గొన్నారు.

తల్లిదండ్రులతో సమావేశం

తగరపువలస, ఫిబ్రవరి 5 : బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం తరగతుల్లో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. విద్యా కమిటీ చైర్మన్ మానసాదేవి అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో ఉపాధ్యాయులు అప్పలరాజు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్‌లో విద్యార్థుల ప్రతిభ

సాగర్‌నగర్, ఫిబ్రవరి 5 : చెన్నైలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ విశ్వవిద్యాలయంలో ఈనెల 1 నుంచి 3వ తేదీ వరకు అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయూ) ఆధ్వర్యంలో నిర్వహించిన సౌత్ జోన్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో గీతం విద్యార్థులు ద్వితీయ బహుమతి పొందారు. ఈమేరకు వారు అఖిల భారత ఇంటర్ యూనివర్సిటీస్ పోటీలకు ఎంపికైనట్టు గీతం క్రీడా విభాగం డైరెక్టర్ డాక్టర్ యు. విజయ్‌కుమార్, క్రీడా విభాగం డిప్యూటీ డైరెక్టర్ జి. శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కేన్సర్‌పై అవగాహన సదస్సు

సాగర్‌నగర్, ఫిబ్రవరి 5 : గీతం యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ సైన్స్, బయో కెమిస్ట్రీ, బయో ఇన్ఫర్‌మేటిక్స్ విభాగం ఆధ్వర్యంలో కేన్సర్‌పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ కేన్సర్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ మురళీకృష్ణ కేన్సర్‌కు కారణాలు, చికిత్స గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కేఎస్ కృష్ణ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. వేదవతి పాల్గొన్నారు.

బీఆర్‌టీఎస్ నిర్వాసితుల సమస్యలపై వినతి

సింహాచలం, ఫిబ్రవరి 5 : జీవీఎంసీ 98వ వార్డులోని తొలిపావంచా నుంచి పాతఅడివివరం వరకు ఉన్న బీఆర్‌టీఎస్ కారిడార్ నిర్మాణంలో ఆస్తులు కోల్పోయిన వారికి సమాన విలువ కలిగిన టీడీఆర్‌లు అందజేయాలని టీడీపీ విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ కోరారు. సోమవారం ఆయన నిర్వాసితులతో కలిసి జిల్లా కలెక్టర్ మల్లికార్జునకు స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్‌కు నిర్వాసితుల సమస్యలు వివరించి, అందరికీ రూ. 35 వేలు చదరపు గజానికి విలువతో కూడిన టీడీఆర్‌లు మంజూరు చేయాలన్నారు.

సీఎం దృష్టికి నిర్వాసితుల సమస్య

బీఆర్‌టీఎస్ నిర్వాసితుల సమస్యను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకువెళ్లారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఈ సమస్యపై సీఎంకు వినతిపత్రం అందించి, స్థానిక పరిస్థితులను సమగ్రంగా వివరించారు. పేదలను దృష్టిలో పెట్టుకుని మార్కెట్ విలువతో సంబంధం లేకుండా అందరికీ సమానంగా చదరపు గజానికి రూ. 35 వేలు చొప్పున టీడీఆర్‌లు ఇచ్చేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందించారని, త్వరలో సమస్య పరిష్కారమవుతుందని ఎమ్మెల్యే తెలిపారు.

సినిమా గైడ్

- **అంబాజీపేట మ్యారేజి బ్యాండు :** మెలోడి, రమాదేవి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), సప్తగిరి (తగరపువలస)
- **బూట్‌కట్ బాలరాజు :** మోహిని (గాజువాక),
- **ధీర :** కిన్నెర, మౌర్య (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **కిస్మత్ :** కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), విశేష్ (గాజువాక),
- **కెప్టెన్ మిల్లర్ :** వెంకటేశ్వర
- **నా సామిరంగ :** శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, సంగం, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 19,టమాటా 32, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 54, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 44, బీరకాయలు 54, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 22, క్యాబేజ్ 18, క్యారేట్ 24, దొండకాయలు 36, బంగాళా దుంపలు 22, అరటికాయ (పె)4, మునక్కాడలు (కిలో) 95, అల్లం (పాతది) 110, బరబటి 26, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 36, దోస కాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 340, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 50, ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 32, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 56, చిలగడదుంపలు 28 , కంద 54, దేముడు చిక్కుడు 30, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడి కాయ 26, కర్రపెండలం 20, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్రాయిలర్		
రైతు ధర	--	100
ఫారం ధర	--	120
విత్ స్కిన్	--	210
స్కిన్‌లెస్	--	220

మరికొన్ని సిటీ వార్తలు పేజీ IVలో..

ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు ఎప్పుడు ?

- హడావిడిగా నేతల శంకుస్థాపన
- పనుల ప్రారంభోత్సవంలో తాత్సారం
- ప్రమాదాల బారిన స్థానికులు
- నాయకుల తీరుపై విమర్శలు



జాతీయ రహదారిలో బ్రిడ్జి నిర్మించాల్సిన ప్రదేశం

మధురవాడ, ఫిబ్రవరి 5 : మధురవాడ జాతీయ రహదారి పరిధిలోని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో నిర్మించనున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనుల ప్రారంభోత్సవంలో జాప్యం నెలకొంది. పాఠశాల విద్యార్థులు హైవే దాటి రాకపోకలు చేసే సమయంలో తరచూ ప్రమాదాల బారిన పడుతుండడంతో ప్రభుత్వం ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఈమేరకు జీవీఎంసీ రూ.2.5 కోట్లు సీఎస్ఆర్ నిధులు కేటాయించింది. గత నెల 12న పనుల ప్రారంభోత్సవానికి వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చంద్రంపాలెం పాఠశాల ఆవరణలో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.రెండు నెలల్లో పనులు పూర్తిచేసి బ్రిడ్జిని విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. అయితే శంకుస్థాపన జరిగి ఇప్పటికి 20 రోజులకు పైగా అవుతున్నా ఇంతవరకు ప్రారంభం కాకపోవడం పట్ల స్థానికులు పెదవి విరుస్తున్నారు. పనులు ఇంకెప్పుడు చేస్తారని ప్రశ్నిస్తున్నారు. వంతెన అందుబాటులోకి వస్తే నాలుగు వేల మంది విద్యార్థులతో పాటు వందలాది మంది ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది. పాలకులు, అధికారులు స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. కాగా ఈ విషయమై వంతెన పనులు చేపడుతున్న యాజమాన్యాన్ని వివరణ కోరగా పనులకు సంబంధించి థర్డ్ పార్టీ పరిశీలన జరుగుతోందని, త్వరలోనే నిర్మాణం మొదలుపెట్టి నిర్దిష్ట సమయంలో పూర్తి చేస్తామని తెలిపారు.

టీడీపీలో చేరిన మత్స్యకార నాయకుడు



చంద్రబాబును కలిసిన రామచంద్రరావు, పక్కన ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 5 : నగరానికి చెందిన మత్స్యకార నాయకుడు,ఫిలిం సెన్సార్ బోర్డు మాజీ సభ్యుడు జీవీ రామచంద్రరావు తెలుగుదేశం పార్టీలో చేరారు. కె. కోటపాడు మండలం గొండుపాలెం వద్ద సోమవారం జరిగిన రా..కదలిరా సభలో ఆయన పార్టీ అధినేత చంద్రబాబునాయుడును కలిసారు. ఈ సందర్భంగా తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సమక్షంలో పార్టీలో చేరారు.

జీవీఎంసీకి 132 వినతులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 5 : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 132 వినతులు వచ్చాయని మేయర్ హరి వెంకటకుమారి తెలిపారు. ఈమేరకు ఆమె, కమిషనర్ సాయికాంత్ వర్మతో కలిసి ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలను మూడు రోజుల్లో పరిష్కరించాలని అధికారులను ఆమె ఆదేశించారు.

అప్పన్న తెప్పోత్సవం ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈఓ శ్రీనివాసమూర్తి, తదితరులు

సింహాచలం, ఫిబ్రవరి 5 : సింహగిరి కొండ దిగువన ఈనెల 9న జరగాల్సిన అప్పన్న తెప్పోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను ఈఓ శ్రీనివాసమూర్తి సోమవారం పరిశీలించారు. తొలుత ఆయన తన కార్యాలయంలో ఏర్పాట్లపై సిబ్బంది, పాలక మండలి సభ్యులు, ఏసీపీలతో చర్చించారు.అనంతరం వరాహ పుష్కరిణికి వెళ్లి అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ దేవస్థానానికి చెందిన అన్ని విభాగాలను సమన్వయం చేసుకుని ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. పుష్కరిణి వద్ద వేదిక ఏర్పాటు, హంసాకృతి తెప్ప నిర్మాణం, విద్యుద్దీపాలంకరణ, పారిశుధ్య నిర్వహణపై చర్యలు తీసుకోవాలని సిబ్బందికి విధివిధానాలను తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో సంపూర్ణ రామాయణం ఘట్టం ప్రదర్శన



రామాయణం ఘట్టంలో కళాకారులు

సాగర్‌నగర్, ఫిబ్రవరి 5 : అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ పురస్కరించుకుని ఇస్కాన్‌లో సోమవారం సంపూర్ణ రామాయణం ఘట్టం ప్రదర్శించారు. చక్కని అలంకరణలతో, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి 40 పాత్రలతో కళాకారులు ఇచ్చిన ప్రదర్శన భక్తులను అలరించాయి. ముందుగా సీతా రామ, లక్ష్మణ, హనుమ విగ్రహాలకు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్, మాతాజీ నితాయిసేవని హారతులు పట్టారు. అనంతరం రామ రావణ యుద్ధం, శ్రీరామ పట్టాభిషేకం తదితర ఘట్టాలను ప్రదర్శించారు.

విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యంపై లిప్ బృందం ఆరా

భీమునిపట్నం, ఫిబ్రవరి 5 : పట్టణంలోని జీవీఎంసీ పండిట్ నెహ్రూ హైస్కూల్‌ను లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ జిల్లా బృందం సందర్శించింది. ఈ సందర్భంగా టీమ్ అధ్యక్షుడు, భీమిలి డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్. సుధాకర్, సభ్యుడు జి. రవికుమార్ విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యాన్ని పరిశీలించారు. అలాగే పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను పరిశీలించారు.

చిప్పాడలో ఉచిత వైద్య శిబిరం



బాలికలను పరీక్షిస్తున్న డాక్టర్ శోభారాణి

భీమునిపట్నం (రూరల్), ఫిబ్రవరి 5 : మండలంలోని చిప్పాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 385 మంది విద్యార్థులకు తాళ్లవలస పీహెచ్‌సీ సిబ్బంది సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు డి. శోభారాణి మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. దివీస్ కంపెనీ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమావతి, పాఠశాల హెచ్ఎం రత్నం, స్థానిక నాయకులు సూరిబాబు, రాజారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

కొమ్మాది, ఫిబ్రవరి 5 : ఉపాధ్యాయులు విద్యార్థులకు వినూత్న రీతిలో బోధన చేయాలని ఉపాధ్యాయ శిక్షణ తరగతుల రాష్ట్ర పరిశీలకురాలు కల్పన అన్నారు. సోమవారం ఆమె చంద్రంపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయులకు బోధనపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజబాబు, చినగదిలి, పద్మనాభం, ఆనందపురం, భీమిలి మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రసాదరెడ్డి

జీవశాస్త్రంపై రాష్ట్రస్థాయి సదస్సు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 5 : ఏయూలోని బయోటెక్నాలజీ విభాగంలో సోమవారం నుంచి జీవశాస్త్రంపై రాష్ట్రస్థాయి సదస్సు ప్రారంభమైంది. ఈ సందర్భంగా వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను విశ్వవనరులుగా తీర్చిదిద్దడంలో ఏయూ ముందంజలో ఉందన్నారు. విద్యార్థులు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవడంలో ఎవరి ప్రత్యేకతను వారు చాటుకోవాలని చెప్పారు. మూడు రోజుల పాటు జరిగే సదస్సును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సదస్సులో ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె. శ్రీనివాస్‌రావు, బయో టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ వి. లక్ష్మి, చైర్ ప్రొఫెసర్ ధనుంజయ్, సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

స్పందనకు ఆరు ఫిర్యాదులు

భీమునిపట్నం, ఫిబ్రవరి 5 : పట్టణంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఆరు ఫిర్యాదు అందాయని జడ్సీ శైలజా వల్లీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిట్టివలసలోని ఆదర్శనగర్‌లో జిరాయితీ స్థలంలో జీవీఎంసీ అధికారులు డ్రైనేజీ నిర్మించడంపై సంబంధిత స్థల యజమానులు వినతిపత్రం అందజేశారన్నారు. అలాగే ఇంజనీరింగ్ విభాగానికి 3, రెవెన్యూ, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున అర్జీలు అందాయని తెలిపారు. వినతులను ఆయా విభాగాధిపతులకు పంపించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విశ్వకర్మ కౌసల్య యోజనపై అవగాహన

పెదవాల్తేరు, ఫిబ్రవరి 5 : కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన విశ్వకర్మ కౌసల్యా యోజనను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర కోరారు. సోమవారం ఆయన నగరంలోని పార్టీ కార్యాలయంలో విశ్వకర్మ యోజనపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఈపథకం ద్వారా 18 రకాల చేతివృత్తుల వారు లబ్ధి పొందవచ్చునని చెప్పారు. పథకానికి కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా లేదా సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ రంగం ధనేశ్వరరావు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాస్, కిలపర్తి సత్యనారాయణ, ఓబీసీ మోర్చా జిల్లా సోషల్ మీడియా కార్యదర్శి జి. గౌదీశంకర్ పాల్గొన్నారు.

జాతీయ రగ్బీ పోటీలకు భీమిలి విద్యార్థులు



జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

భీమునిపట్నం, ఫిబ్రవరి 5 : గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఈనెల 13 నుంచి జరిగే జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు పట్టణంలోని ది సన్ స్కూల్ నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈమేరకు సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు సాత్విక్ రామ్, బి. మహేష్, బి. హర్షిత, ఎన్. యష్మితను స్కూల్ కరస్పాండెంట్ కైతపల్లి శ్రీనివాసరావు అభినందించారు. ఈనెల 2 నుంచి 4 వరకూ స్థానిక ఫుట్‌బాల్ మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

ఆరో వార్డులో జనసేన నేతల పాదయాత్ర



సందీప్‌కు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

కొమ్మాది, ఫిబ్రవరి 5 : జీవీఎంసీ ఆరో వార్డులోని పీఎంపాలెంలో జనసేన పార్టీ భీమిలి అసెంబ్లీ ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ సోమవారం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమిని ప్రజలు ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు బీసీ సెల్ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ, తెలుగు యువత ఉపాధ్యక్షుడు గరె గురునాథ్, జనసేన వార్డు అధ్యక్షుడు సంతోష్‌నాయుడు, కృష్ణయ్య, పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో యూరియా కొరతతో ఇక్కట్లు

పద్మనాభం (రూరల్), ఫిబ్రవరి 5 : రైతు భరోసా కేంద్రాల్లో యూరియా కొరత వల్ల రబీ రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 16 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం రైతులు బావులు, బోర్లు ఉన్నచోట రబీ సీజన్ కింద రాగి, మొక్కజొన్న పంటలు సాగుచేస్తున్నారు. పంటలకు అవసరమైన యూరియా ఆర్‌బీకేల్లో అందుబాటులో లేదు. దీంతో వ్యయప్రయాసలకోర్చి దూర ప్రాంతాలకు వెళ్లి అధిక ధరలకు ప్రైవేట్ దుకాణాల్లో కొనుగోలు చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను ఆర్‌బీకేల్లో రాయితీపై అందిస్తున్నట్టు ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నా, అవన్నీ మాటలకే పరిమితమవుతున్నాయని వాపోతున్నారు. యూరియా కోసం పనులు మానుకొని ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఎరువులను ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

జూపార్కు మలుపులో తరచూ ప్రమాదాలు

భయాందోళనలో స్థానికులు



జూపార్కు మలుపు ఇటీవల జరిగిన కారు ప్రమాదం

ఎండాడ, ఫిబ్రవరి 5 : జీవీఎంసీ 8వ వార్డు బీచ్ రోడ్డులోని జూపార్కు మలుపులో తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. ట్రాఫిక్ పోలీసుల వైఫల్యం, వాహనదారుల అతివేగం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కొత్త ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు నాలుగు ప్రమాదాలు జరగ్గా ఇద్దరు మృతి చెందారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. మూడు రోజుల క్రితం కారు చెట్టును ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన ఘటన మరువకముందే ఆదివారం గీతం వర్సిటీలో ఎంబీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థి రెండు బైక్‌లు ఢీకొనడంతో మృతి చెందాడు. ప్రతిరోజూ బీచ్‌రోడ్డుతో పాటు ఎండాడ-రుషికొండ మార్గం, ఐటీ రోడ్డులో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అతివేగంగా వచ్చి డివైడర్లను ఢీకొట్టడంతో పాటు కాలనీల్లో మితిమీరిన వేగం వల్ల వాహనదారులతో పాటు అటుగా వెళ్లే పాదచారులు తీవ్ర గాయాలపాలవుతున్నారు. సాగర్‌నగర్, రుషికొండ, విశాలాక్షినగర్, ఎండాడ, ఐటీ రోడ్లలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. దీంతో స్థానికులు రోడ్డు మీదకు రావాలంటే భయపడుతున్నారు. రోడ్లపై వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఒకవైపు, మితిమీరిన వేగం మరోవైపు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వరుస సంఘటనల నేపథ్యంలో పోలీసులు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



పట్టణంలోని పైలాన్

శరవేగంగా పైలాన్ సుందరీకరణ పనులు

భీమునిపట్నం, ఫిబ్రవరి 5 : బీచ్ రోడ్డులో పైలాన్ సుందరీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రాష్ట్రంలో మొదటి పురపాలక సంఘంగా ఏర్పడిన భీమిలి 150 ఏళ్ల ఉత్సవాలకు గుర్తుగా 2010లో వుడా ఈ పైలాన్‌ను నిర్మించింది. కట్టడంలో భీమిలి చారిత్రక నేపథ్యం, పట్టణ ప్రజల జీవన స్థితిగతులు కళ్లకు కట్టేలా రూపొందించారు. ప్రస్తుతం ఈ చారిత్రక కట్టడం శిథిలం కావడంతో జీవీఎంసీ మరమ్మతులతో పాటు సుంద రంగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే పనులు పూర్తి దశకు చేరుకున్నాయి. పైలాన్‌ను ఆనుకుని ఉన్న వాటర్ ఫౌంటెన్‌ను కూడా అందంగా తీర్చిదిద్దారు.

రిఫరల్ ఆస్పత్రి ఆవరణలో మురుగు



ఆసుపత్రి ఆవరణలో మురుగు నీరు

ఆరిలోవ, ఫిబ్రవరి 5 : ఆరిలోవ రిఫరల్ ఆస్పత్రి ఆవరణలో మురుగు నీరు, చెత్త పేరుకుపోవడంతో రోగులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పరిశుభ్రంగా ఉండాల్సిన ఆస్పత్రి ఆవరణ చెత్తతో ఉండడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి.ముఖ్యంగా ఆస్పత్రి గేటు నుంచి లోపలకు వెళ్లే ప్రాంతమంతా మురుగునీరు నిల్వ ఉండడం వల్ల విపరీతమైన దుర్వాసన వస్తోంది. దీంతో ఆస్పత్రికి వస్తున్న వారు మరిన్ని రోగాల బారిన పడుతున్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని పదే పదే చెప్పే వైద్యులు ఆస్పత్రి ఆవరణలోని దుస్థితిని పట్టించుకోకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఘనంగా వంశీకృష్ణ జన్మదిన వేడుకలు



వంశీని గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 5 : జనసేన పార్టీ నగర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ వంశీకృష్ణయాదవ్ జన్మదిన వేడుకలు శివాజీపాలెంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో కార్యాలయానికి తరలివచ్చి వంశీకృష్ణకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి, గజమాలతో సత్కరించారు. అలాగే రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం శివాజీ పార్కు నుంచి భారీ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు బియ్యం పంపిణీతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.

విశాలాక్షినగర్ : టీడీపీ నాయకుడు వేజెళ్ల సుబ్బరాజు ఆధ్వర్యంలోనూ నాయకులు వంశీకృష్ణను గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో అక్కరబోయిన రాంబాబు, వెంపాడ శ్రీనివాసరెడ్డి, దబ్బి వెంకట్రావు, చెట్టుపల్లి వెంకట్రావు, రాజా, ఎన్. లక్ష్మి, సీత, లీలా పాల్గొన్నారు.

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, ఫిబ్రవరి 5 : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం సోమవారం నేత్రపర్వంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవ, ప్రభాతారాధనలు జరిపి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై ఉంచారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించిన అర్చకులు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు.మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ఆసరా సభలో డ్వాక్రా మహిళల ఇక్కట్లు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 5 : ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా మైదానంలో సోమవారం తూర్పు నియోజకవర్గంలోని డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. ఉదయం 11 గంటలకు సభ జరుగుతుందని ముందుగా ప్రకటించి, సభ్యులను 9 గంటలకు మైదానం వద్దకు రప్పించారు. దీంతో వేగంగా వచ్చిన వారు సభ ప్రారంభం వరకూ అక్కడ ఉండలేక ఇబ్బంది పడ్డారు. కొందరు సభ మొదలు కాకముందే వెళ్లిపోయారు. కాగా ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈకార్యక్రమం జరిగింది.

నగరపాలెం వంతెనపై గోతులు

భీమునిపట్నం, ఫిబ్రవరి 5 : బీచ్‌రోడ్ గంభీరం గెడ్డపై కె. నగరపాలెం వంతెన రహదారి మధ్యలో ఏర్పడిన గోతుల వల్ల వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికే ఇక్కడ పలు ప్రమాదాలు జరిగి పదుల సంఖ్యలో గాయపడ్డారు. అధికారులు తక్షణమే స్పందించి గోతుల పూడ్చివేతకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రేవిడి పీహెచ్‌సీలో సక్రమంగా అందని వైద్యం

పద్మనాభం (రూరల్), ఫిబ్రవరి 5 : మండలంలోని రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. ఈ ఆస్పత్రి 24 గంటల పాటు అందుబాటులో ఉంటూ సేవలందించాల్సి ఉన్నా.. సాయంత్రమయ్యేసరికి సిబ్బంది ఆస్పతి నుంచి వెళ్లిపోతున్నారు. దీంతో అత్యవసర చికిత్స కోసం ఎవరైనా వస్తే స్టాఫ్ నర్సు ప్రథమ చికిత్స చేసి పంపిస్తున్నారు. రోగి పరిస్థితి విషమంగా ఉంటే పట్టణ ప్రాంతాలకు వెళ్లాలని సూచిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో వైద్యులు, సిబ్బంది ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో అంతుపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్ని నెలలుగా ఈ పరిస్థితి ఉన్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు. ఉందని చెబుతున్నారు. ఈ విషయమై వైద్యురాలు కె. స్వప్న వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా స్టాఫ్ నర్సులు ఇద్దరే ఉన్నారని, వారు వారానికి ఒకరు చొప్పున రాత్రి సమయంలో డ్యూటీలో ఉంటున్నారని తెలిపారు. ఏదైనా అవసరమైతే అటెండర్ సహకరిస్తారన్నారు. ఫోన్ చేస్తే సిబ్బంది అందుబాటులోకి వస్తారని సమాధానమిచ్చారు.